తెలంగాణ విమోచన దినోత్సవాలకు రక్షణశాఖ మంత్రి రాజనాథ్ సింగ్




PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

పల్లెల్లో అంతర్గత రోడ్లతో రవాణా సౌకర్యం మెరుగు




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 258 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- ఆదివారం 14 సెప్టెంబర్ 2025


# కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా సాధించాల్సిందే

తెలంగాణకు 904 టీఎంసీల నీటి వాటాను రాబట్టాల్సిందే

కృష్ణా జలాల ట్రిబ్యునల్ ముందు వాదనలు వినిపించాలి

న్యాయనిపుణులు, అధికారులకు సిఎం రేవంత్ ఆదేశం



**హైదరాబాద్,సెప్టెంబర్13(పీసీడబ్ల్యూ న్యూస్):** కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటాను సాధించి తీరాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి న్యాయ నిపుణులను, ఇరిగేషన్ శాఖ ఇంజనీరింగ్ అధికారులను అప్రమత్తం చేశారు. కృష్ణాలో నికర జలాలైనా, మిగులు జలాలైనా, వరద జలాలైనా సరే.. తెలంగాణాకు చెందాల్సిన నీటివాటాలో ఒక చుక్క నీరు కుడావదులుకునేది లేదని ముఖ్యమంత్రి అన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 904 టీ-ఎంసీల నీటి వాటాను సాధించుకు నేందుకు పట్టుబట్టాలన్నారు. అందుకు అవసరమైన ఆధారాలన్నీ వెంటనే సిద్ధం చేసి న్యాయ నిపుణులకు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో ఢిల్లీలో కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్ విచారణలో తెలంగాణ తుది వాదనలు వినిపించాల్సి ఉంది. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బలమైన వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. స్వయంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి ఈ విచారణలో పాల్గొంటారని ముఖ్యమంత్రి తెలిపారు. ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణా ప్రభుత్వం అనుసరించాల్సిన వైఖరిపై శనివారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం మిగతా2లో...

# జీఎస్టీ సంస్కరణలతో ఔషధాల ధరలు తగ్గింపు

క్యాన్సర్ మందుల ధరలు తగ్గుదలతో ఊరట

కార్లు, బైకుల ధరలు కూడా తగ్గిస్తూ ప్రకటనలు

22 తరవాత సిమెంట్,నిర్మాణ సామాగ్రి ధరలు తగ్గుదల

భారత ఆర్థికవ్యవస్థ 7.8శాతం వృద్ధిని సాధించిందన్న ప్రధాని మోడీ




**న్యూఢిల్లీ,సెప్టెంబర్13(పీసీడబ్ల్యూ న్యూస్):** తమ ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సవరణలతో క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధుల మందుల ధరలు తగ్గుతాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కార్లు, బైక్‌లను తయారుచేసే అనేక కంపెనీలు ఇప్పటికే ధరలను తగ్గించాయని.. మిగతా2లో...




## సర్‌పై సర్వ హక్కులు మావే... కాదనలేరు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్13(పీసీడబ్ల్యూ న్యూస్):** దేశంలో క్రమం తప్పకుండా విరామాల నడుమ ప్రత్యేక విస్తృత ఓటర్ల జాబితా సవరణ (సర్) చేపట్టే అధికారం ఎన్నికల సంఘానికి ఉంది. ఎన్నికల సంఘానికి ఇటువంటి చర్యకు దిగే అధికారం అనేక విధాలుగా సంక్రమించి ఉందని సుప్రీంకోర్టుకు తెలిపారు. అత్యున్నత న్యాయస్థానానికి ఈ మేరకు తమ కౌంటర్ అఫిడవిట్‌తో కూడిన ప్రతివాదనను మిగతా2లో...

## కుమ్రం భీమ్ జిల్లాలో విషాదం

కుంటలో పడి తల్లీ ముగ్గురు పిల్లల దుర్మరణం




## యూరియా కోసం రైతుల పోరాటం






## మావోయిస్టు అగ్రనేత సుజాతక్క లొంగుబాటు

- ధృవీకరించిన డిజిపి జితేందర్

**హైదరాబాద్,సెప్టెంబర్13(పీసీడబ్ల్యూ న్యూస్):** మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు పోతుల కల్పన ఎలియాస్ సుజాతక్క తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. గద్వాల ప్రాంతానికి చెందిన ఆమె ప్రస్తుతం మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో ఉన్న ఏకైక మహిళా నాయకురాలు. పశ్చిమబెంగాల్‌లో 2011 జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు పార్టీ అగ్రనేత కిషన్‌జీ భార్య ఆమె. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ సౌత్ సబ్ జోనల్ బ్యూరో ఇన్‌ఛార్జిగా ఉన్నట్లు- సమాచారం. మిగతా2లో...




## బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ఎందుకు మాట్లాడాలి

కెటిఆర్ విమర్శలపై మండిపడ్డ పిసిసి చీఫ్

# గ్రూప్ -1 అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ

2లక్షల ఉద్యోగాల హామీని విస్మరించిన రేవంత్

అశోక్ నగర్ చౌరస్తాలో రాహుల్ ఏం మాట్లాడారు

నిరుద్యోగుల పక్షాన అసెంబ్లీలో పోరాడుతాం


నిరుద్యోగ మేళాలో ఎమ్మెల్యే హరీష్ రావు



**సిద్ధిపేట,సెప్టెంబర్13(పీసీడబ్ల్యూ న్యూస్):** గ్రూప్ వన్ పరీక్ష అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని మాజీ మంత్రి బిఆర్ఎస్ నేత హరీశ్ రావు డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేసిండని విమర్శించారు. రాహుల్ గాంధీని అశోక్ నగర్ లో కూర్చోబెట్టి హామీ ఇచ్చి మోసం చేశారు అని అన్నారు. నిరుద్యోగుల పక్షాన పోరాటం చేస్తామని.. అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని.. మీకు న్యాయం జరిగే వరకూ కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సిద్దిపేటలో మెగా జాబ్ మేళా కార్యక్రమానికి హరీష్ రావు హాజరయ్యారు. మిగతా2లో...

## మణిపూర్‌లో ఇప్పుడా పర్యటించేది

- మోడీ పర్యటనపై ప్రియాంక పెదవి విరుపు



**వయనాడ్,సెప్టెంబర్13(పీసీడబ్ల్యూ న్యూస్):** జాతుల మధ్య ఘర్షణ జరిగిన రెండేళ్ల తర్వాత ప్రధాని మోదీ మణిపుర్‌లో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన పర్యటనపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వయనాడ్‌లో విలేకరులతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. మణిపుర్‌లో ఘర్షణలు జరిగిన రెండేళ్ల తర్వాత ప్రధాని మోదీ అక్కడ పర్యటనకు వెళ్లడం దురదృష్ట కరమన్నారు. భారత్‌లోని ప్రధానమంత్రుల సంప్రదాయం ఇది కాదంటూ విమర్శించారు. ప్రమాదాలు, విషాదాలు జరిగినప్పుడు ప్రధానులు వెంటనే అక్కడికి వెళ్తారన్నారు. మిగతా2లో...



## యూపిపిఎస్సీ తరహాలో జాబ్ క్యాలెండర్

- బిజెపి అధ్యక్షుడు రామ్ డిమాండ్

**హైదరాబాద్,సెప్టెంబర్13(పీసీడబ్ల్యూ న్యూస్):** యుపిఎస్‌సి తరహాలో రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ (టిజిపిఎస్‌సి) కూడా జాబ్ క్యాలెండర్ రూపొందించి ప్రతి ఏడాది పరీక్షలు నిర్వహించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మిగతా2లో...

## భారత్,చైనాలపై టారిఫ్‌ల విధించండి

జి-7 దేశాలపై ట్రంప్ ఒత్తిడి

ఉక్రెయిన్‌పై యుద్ధం ఆపడానికేనంటూ వెల్లడి



# సర్‌పై సర్వ హక్కులు మావే... కాదనలేరు

(మొదటి పేజీ తరువాయి)

తెలియచేశారు. ఏ ఇతర అధికారిక వ్యవస్థలకు సంబంధం లేకుండా, వాటి పరిధి రాకుండా కూడా ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ చేసే అధికారం సంతరించుకుని ఉన్నామని ఈ వాదనలో తెలిపారు. 2026 జనవరి 1న క్వాలిఫైయింగ్ తేదీగా సర్ ముందస్తు సన్నాహకాలు చేపట్టవచ్చునని ఈ ఏడాది జులై 5న రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు అధికారిక లేఖలు పంపించామని కూడా తెలిపారు. ఓటర్ల జాబితా ప్రత్యేక లేదా ఇతరత్రా సవరణలు చేపట్టే రాజ్యాంగ లేదా చట్టబద్ధమైన అధికారం తమకు ఉందని ఎన్నికల సంఘం తెలియచేసుకుంది. దేశవ్యాప్తంగా క్రమం తప్పకుండా అడపాదడపా ఓటర్ల జాబితా సవరణలను ఎన్నికల సంఘం చేపట్టేలా చూడాలని, నిజమైన ఓటర్లు తమ అధికారిక వ్యవస్థలను ఓటు ద్వారా ఎన్నుకునే వీలు కల్గించేలా చూడాలని న్యాయవాది అశ్విన్‌కుమార్ ఉపాధ్యాయ్ దాఖలు చేసుకున్న పిటిషన్ నేపథ్యంలో ఇసి అఫిడవిట్ వెలువడింది.

# కుమ్రం భీమ్ జిల్లాలో విషాదం

## ● కుంటలో పడి తల్లీ ముగ్గురు పిల్లల దుర్మరణం

**కొమురంభీం,సెప్టెంబర్13(పీసీడబ్ల్యూ న్యూస్):** వాంకిడి మండలం డాబా గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గ్రామంలోని ఓ నీటిగుంతలో పడి తల్లి, ముగ్గురు చిన్నారులు మృతిచెందారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. మృతిచెందిన వారిని మోర్లే బుజ్జి బాయి (35), మోర్లే గన్ను(12), వాడే మహేశ్వరీ(9), అదే శశిక(9)గా గుర్తించారు. సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుకొని, పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. మోర్లే బుజ్జి బాయి అనే మహిళ పొలం వద్ద పనిచేస్తున్న సమయంలో నీటి కోసం ముగ్గురు పిల్లలు కుంటలో దిగారు. కుంటలో లోతు ఎక్కువగా ఉండటంతో.. చిన్నారులు నీటిలో మునిగిపోయారు. అది గమనించిన మహిళ చిన్నారులను రక్షించేందుకు నీటిగుంతలోకి దిగింది. గుంతలో నీరు, బురద ఎక్కువగా ఉండటంతో నలుగురు నీటిగుంతలోనే చిక్కుకుని మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు– పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ఎందుకు మాట్లాడాలి

## కెటిఆర్ విమర్శలపై మండిపడ్డ పిసిసి చీఫ్

**హైదరాబాద్,సెప్టెంబర్13(పీసీడబ్ల్యూ న్యూస్):** ఓట్ చోరీ గురించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధారాలతో నిరూపించారని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. దేశవ్యాప్తంగా దీనిపై ఉద్యమిస్తున్న వేళ రాహుల్‌కు మద్దతు పెరిగిందని అన్నారు. మోడీ ఈ విషయంలో అడ్డంగా దొరికారని అన్నారు. ఓ జాతీయ అంశంపై పోరాటం చేస్తుంటే..బిఆర్ఎస్ ఎమ్మెల్యేల గురించి రాహుల్ ఎందుకు మాట్లాడాని ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా గాంధీభవన్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం సిబిఐకి అప్పజెప్పినా కేంద్రంలో ఎందుకు కదలిక లేదని అన్నారు. ఫార్ములా– ఈ కార్ రేసు కేసులో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కు జైలు ఖాయం అని అన్నారు. ఢిల్లీలో బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే హరీష్ రావు, కెటిఆర్, నరేంద్ర మోడిని కలిశారని తెలియజేశారు. వాళ్లు బిజెపిలో చేరినట్లు– తాము కూడా నోటీసులు పంపిస్తామని, సిఎంగా రేవంత్ రెడ్డిని అందరూ కలుస్తారని మహేష్ పేర్కొన్నారు. ఫిరాయింపులపై రాహుల్ స్పందించాలని కెటిఆర్ అంటున్నారని చెప్పారు. రాహుల్ పై మాట్లాడే అర్హత కెటిఆర్ కు ఉందా? అని ప్రశ్నించారు. కాళేశ్వరంపై సిబిఐ విచారణ తప్పించుకోవడానికే.. ఉపరాష్ట్రపతి ఎన్నికకు బిఆర్ఎస్ దూరంగా ఉందని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

# యూరియా కోసం రైతుల పోరాటం

## ● బీబీపేటలో పోలీస్ స్టేషన్‌లో టోకెన్ల పంపిణీ

**కామారెడ్డి,సెప్టెంబర్13(పీసీడబ్ల్యూ న్యూస్):** కామారెడ్డి జిల్లా బీబీపేట మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఎదుట శనివారం యూరియా కోసం రైతుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. వందల మంది రైతులు ఒకేసారి పంపిణీ కేంద్రానికి వచ్చారు. వారిని పోలీసులు అదుపు చేయలేకపోయారు. ఒక దశలో పోలీసులపైనా అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రైతులను స్థానిక పోలీస్ స్టేషన్‌కు పిలిపించి.. పోలీసుల సమక్షంలో టోకెన్లు అందజేశారు. అనంతరం పీఏసీఎస్ వద్ద 930 యూరియా బస్తాలను రైతులకు అందించారు. పోలీస్ స్టేషన్ వద్ద టోకెన్లు తీసుకునే సమయంలో మల్కాపూర్‌కు చెందిన రైతు అంబల్ల చిన్నరేకయ్య ఫిట్స్ వచ్చి పడిపోవడంతో ఆందోళన నెలకొంది. ఆయన్ను ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. ఆయన కోలుకున్నట్లు– స్థానికులు తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు రప్పించి టోకెన్లు ఇవ్వడం ఏంటని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితిని అదుపులోకి తేవడానికి తాము పోలీస్ స్టేషన్‌కు రప్పించామని పోలీసులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల రైతులకు యూరియా కష్టాలు కొనసాగుతున్నాయి. మెదక్ జిల్లా చేగుంటలోని రైతు వేదిక వద్ద వర్షంలో సైతం అన్నదాతలు బారులు తీరారు. చేగుంట రైతు వేదికకు 1500 వందల యూరియా బస్తాలు వచ్చాయన్న సమాచారంతో రైతులు భారీగా తరలివచ్చారు. తిండీతిప్పలు మాని యూరియా కోసం వస్తే.. ఒకే బస్తా ఇస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్పందించి రైతులకు సరిపడా యూరియా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# మావోయిస్టు అగ్రనేత సుజాతక్క లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి)

సుజాతక్క 106 కేసుల్లో నిందితురాలిగా ఉన్నారు. ఆమెతో పాటు మరికొందరు మావోయిస్టులు లొంగిపోయినట్లు తెలుస్తోంది. సుజాతక్కపై రూ.కోటి రివార్డు ఉంది. సుజాతక్క లొంగుబాటు వివరాలను డీజీపీ జితేందర్ వెల్లడించారు. ఆమె స్వస్థలం గద్వాల జిల్లా గట్టు– మండలం పెంచికలపాడు. ఆమె మొదట్లో ఆర్ఎస్‌యూ, జన నాట్యమండలిలో పని చేశారు. 1996లో కమాండర్‌గా విధులు నిర్వహించారు. 2001లో రాష్ట్ర కమిటీ– సభ్యురాలిగా పనిచేశారు. అనారోగ్య కారణాలతో సుజాతక్క బయటికి వచ్చారు. రూ.25 లక్షల రివార్డు అందిస్తాం. మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలని ఆహ్వానిస్తున్నాం. మావోయిస్టులు చాలా మంది లొంగిపోతున్నారని జితేందర్ తెలిపారు.

# భారత్,చైనాలపై టారిఫ్‌ల విధించండి

**వాషింగ్టన్,సెప్టెంబర్13(పీసీడబ్ల్యూ న్యూస్):** రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలపై భారీగా టారిఫ్‌లను విధించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతిపాదనకు ఐరోపా సమాఖ్యతో పాటు–, జి 7 దేశాలు అంగీకరించినట్లు– తెలుస్తుంది. ఉక్రెయిన్‌లో శాంతి పునరుద్ధరణ చేయాలని, అందుకోసం రష్యాపై ఒత్తిడి తేవడమే సరైన మార్గం అని అందులో భాగంగా రష్యా చమురును కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలపై భారీ టారిఫ్‌లు విధించాలని అమెరికా ప్రతిపాదించింది. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌లో జి 7 దేశాలు సమావేశమయ్యాయి. ఈ భేటీలో సుంకాల విధింపుపై చర్చ సాగింది. ఈ సందర్భంగా అమెరికా వాణిజ్య ప్రతినిధి జామిసన్ గ్రీర్ మాట్లాడుతూ ... ఇప్పటికే భారత దిగుమతులపై అమెరికా భారీ సుంకాలు విధించిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ క్లిష్ట సమయంలో నిర్ణయాత్మక చర్య తీసుకోవడానికి జీ 7 దేశాలు ముందుకురావాలని కోరారు. అందుకు జి 7 దేశాలు స్పందిస్తూ ... యుద్ధం ముగింపునకు కట్టు–బడి ఉన్నామని ప్రకటించాయి. రష్యాపై ఒత్తిడి తేవడానికి ఇంతకుముందు ఐరోపా సమాఖ్య (ఈయూ) దేశాల ముందు కూడా ట్రంప్ ఇలాంటి ప్రతిపాదనలే చేశారు. అయితే, ఈ విషయంలో ఈయూ దేశాల్లో భిన్నాభిప్రాయలు వ్యక్తమయ్యాయి. దీంతో అది సాధ్యపడలేదు. ఇవే ప్రతిపాదనలను ఆయన మళ్లీ జి 7 దేశాల ముందుపెట్టడం గమనార్హం. ఇప్పుడు కూడా టారిఫ్‌ల విధింపుపై ఐరోపా సమాఖ్య దేశాల నుంచి భిన్నాభిప్రాయలు వ్యక్తమయ్యాయి. ఫలితంగా అది ఇంకా సాధ్యపడలేదు. ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుకు రష్యా (షశ)పై ఒత్తిడి తేవడమే సరైన మార్గమని అమెరికా భావిస్తోంది.

# కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా సాధించాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. ముఖ్యమంత్రితో పాటు– ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సి.ఎస్.వైద్యనాథన్, కేంద్ర జలసంఘం –మాజీ ఛైర్మన్ కె.వోహ్రా, ఇరిగేషన్ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ పాటిల్, ఇ.ఎన్.సి. అంజద్ హుస్సేన్, సీఎంవో సెక్రెటరీ మాణిక్ రాజ్, ఇరిగేషన్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇంతకాలం కృష్ణా నదీ జలాల్లో జరిగిన అన్యాయానికి అడ్డుకట్ట వేసి, మనకు రావాల్సిన ప్రతి నీటి బొట్టును దక్కించుకునేలా సమర్థవంతమైన వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి న్యాయ నిపుణులకు పలు సూచనలు చేశారు. అందుకు అవసరమైన సాక్ష్యాధారాలన్నీ ట్రిబ్యునల్ కు సమర్పించాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటివరకు కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులు, నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టులు, అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులు, నిర్లక్ష్యంగా వదిలేసిన ప్రాజెక్టుల వివరాలన్నీ ట్రిబ్యునల్ ముందు ఉంచాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో జారీ చేసిన జీవోలు, మెమోలు, డాక్యుమెంట్లన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని, అప్పటి నుంచి ఇప్పటివరకు ఉన్న ప్రాజెక్టుల వివరాలన్నీ ట్రిబ్యునల్కు అందించాలని చెప్పారు. గత ప్రభుత్వం కృష్ణా జలాల్లో రావాల్సిన నీటి వాటాలను సాధించకపోగా ఏపీకి 512 టీ–ఎంసీలు కట్టబెట్టి, 299 టీ–ఎంసీల వాటాకు ఒప్పుకొని తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని ఈ సందర్భంగా చర్చకు వచ్చింది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ 299 టీ–ఎంసీల వాటాకు ఒప్పుకున్న విషయాన్ని ఏపీ ఇప్పుడు ట్రిబ్యునల్ ముందుకు తెచ్చిందని న్యాయ నిపుణులు సీఎంకు వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ ప్రయోజనాలను పట్టించుకోకపోవటంతో వ్యవహరించటంతో ఈ పరిస్థితి వచ్చిందని ముఖ్యమంత్రి అన్నారు. గడిచిన పదేండ్లలో అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం కృష్ణా జలాల్లో న్యాయపరంగా రావాల్సిన నీటి కోటా సాధించటంలో దారుణంగా విఫలమైందన్నారు. కృష్ణాపై తలపెట్టిన పాలమూరు నుంచి డిండి వరకు ప్రాజెక్టులన్నింటినీ పెండింగ్లో పెట్టిందన్నారు. నీటి వాటాల విషయంలో తీరని ద్రోహం చేసిందన్నారు. దిగువ రాష్ట్రాల హక్కులతో పాటు– నదీ వాటాల పంపిణీ న్యాయ సూత్రాల ప్రకారం కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రానికి కృష్ణాలో 904 టీ–ఎంసీల నీటి వాటా రావాల్సి ఉందని, అందుకు అనుగుణంగా వాదనలు సిద్ధం చేయాలని సీఎం స్పష్టం చేశారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉదాసీనంగా వ్యవహరించటంతో ఏపీ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలించుకు పోయిందని, ఆ విషయాన్ని ట్రిబ్యునల్ ముందుకు తీసుకురావాలని సీఎం చెప్పారు. శ్రీశైలం రిజర్వాయర్ నిండకముందే, పోతిరెడ్డిపాడు నుంచి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా రోజుకు పది టీ–ఎంసీల నీటిని ఏపీ మళ్లిస్తుందని, ఇతర బేసిన్లకు తరలించుకుపోతోందని అన్నారు. ఎక్కడపడితే అక్కడ కాల్వల సామర్థ్యం పెంచుకోవటంతో పాటు– పట్టిసీమ, పులిచింతల, చింతలపాడు వరకు ఏపీ అక్రమంగా నీటిని తరలిస్తున్న అంశాలన్నీ ఆధారాలతో సహా ట్రిబ్యునల్కు నివేదించాలని, అందుకు సన్నద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. కృష్ణా నీటిని ఏపీ అక్రమంగా మళ్లించటంతో శ్రీశైలం, నాగార్జునసాగర్ తో పాటు– పులిచింతల వద్ద ఉన్న జల విద్యుత్తు ప్రాజెక్టులు మూత పడే ప్రమాదం ముంచుకు వచ్చిందన్నారు. తక్కువ ఖర్చుతో ఉత్పత్తయ్యే జల విద్యుత్తు ఉత్పత్తికి విఘాతం కలుగుతోందన్నారు. ఈ విషయాలన్నీ ట్రిబ్యునల్ ఎదుట వాదనలుగా వినిపించాలని సీఎం ఆదేశించారు. కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రం కావటంతో తెలంగాణకు రావాల్సిన హక్కులు, నీటి వాటాలను సాధించుకునేందుకు అన్ని అర్హతలున్నాయని సీఎం అన్నారు. సాగునీటి, తాగునీటి అవసరాలతో పాటు– మెట్ట ప్రాంతం, కరువు ప్రాంతమైన ఉమ్మడి మహబూబ్నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు కృష్ణా జలాలు తప్ప గత్యంతరం లేదనే విషయాన్ని ట్రిబ్యునల్ దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. ఇప్పటి వరకు తెలంగాణా ప్రాంతంలో తలపెట్టిన ప్రాజెక్టులు పూర్తి చేయక పోవడం వల్లనే కృష్ణా జలాశయాలను తెలంగాణా వినియోగించు కోలేకపోయిందని గుర్తు చేయాలన్నారు. తెలంగాణ తరఫున వాదనలను వినిపించేందుకు ఇదే సరైన అవకాశమని సీఎం అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంతో పాటు–, కృష్ణా నదీ జలాల్లో రావాల్సిన వాటాల భవిష్యత్తును దిశానిర్దేశర చేసే వాదనలు కావటంతో ఈ అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లో జారవిడుచుకోవద్దని సీఎం న్యాయ నిపుణులకు సూచించారు.

# జిఎస్టీ సంస్కరణలతో ఔషధాల ధరలు తగ్గింపు

(మొదటి పేజీ తరువాయి)

సెప్టెంబర్ 22 తర్వాత సిమెంట్ నిర్మాణ సామగ్రి కూడా చౌకగా మారతాయని ప్రధాని తెలిపారు. వివిధ హోటళ్లపై జీఎస్టీని 5 శాతం తగ్గించడం వల్ల పర్యాటకులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈవిధంగా దేశంలోని అనేక కుటుంబాలపై భారం తగ్గించామంటూ వ్యాఖ్యానించారు. 2025–26 మొదటి త్రైమాసికంలో భారత ఆర్థికవ్యవస్థ 7.8శాతం వృద్ధిని సాధించిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థికవ్యవస్థగా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోందన్నారు. మేక్ ఇన్ ఇండియా ద్వారా దేశం చేసే ఎగుమతుల్లో వృద్ధిని సాధించగలిగామన్నారు. కాంగ్రెస్ హయాంలో ఔషధాలు, బీమాపై అధిక పన్నులు విధించారని ప్రధాని మండిపడ్డారు. 2014కి ముందు టూత్‌పేస్ట్, సబ్బు, నూనె వంటి రోజువారీ నిత్యావసర వస్తువులకు కూడా 27 శాతం పన్ను విధించేవారు. నేడు వీటిపై కేవలం 5శాతం జీఎస్టీ మాత్రమే వర్తిస్తుంది. కాంగ్రెస్ హయాంలో ఔషధాలు, బీమాపై అధిక పన్నులు విధించడం వల్ల సాధారణ కుటుంబాలకు ఆరోగ్య సంరక్షణ చాలా ఖరీదైనదిగా మారిందని అన్నారు. మన ఆర్థికవ్యవస్థ తయారీ రంగం వృద్ధి మన జాతీయ భద్రతకు చాలా ముఖ్యమైనదన్నారు. ప్రజల సాధికారత ద్వారానే భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుంద న్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో.. ఉగ్రవాదాన్ని పెంచి, పోషిస్తున్న వారికి భారత సైన్యం ఎలా బుద్ధి చెప్పిందో ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రపంచం మొత్తం చూసిందని ప్రధాని మోదీ అన్నారు. మన సాయుధ దళాలు చూపిన తెగువకు దేశం మొత్తం గర్వపడిందన్నారు. ఈ ఆపరేషన్‌లో స్వదేశీ ఆయుధాలే మన దేశాన్ని రక్షించడంలో ముఖ్య పాత్ర పోషించాయన్నారు. మణిపుర్‌లో జాతుల మధ్య హింస చెలరేగిన రెండు సంవత్సరాల తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి ఆ రాష్ట్రంలో నేడు పర్యటించనున్నారు. దీనికి ముందు మిజోరంలో పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. బైరాబి–సైరాంగ్ రైల్వేలైన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మిజోరం నుంచి చురాచంద్‌పుర్ చేరుకుంటారు.

# గ్రూప్ –1 అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రూప్ వన్ లో ఉద్యోగానికి మంత్రులు, అధికారులు లక్షల రూపాయలు నిరుద్యోగుల వద్ద లంచం అడిగారని చెబుతున్నారని ఆయన మండిపడ్డారు. తప్పును సరిదిద్దుకోకుండా మరోసారి అప్పీల్‌కి వెళ్లాలని ప్రభుత్వం భావించడం సిగ్గుచేటని.. అన్నారు. పట్టుదలతో కృషి చేస్తే జీవితంలో ఏదైనా సాధించవచ్చుని హరీశ్ పేర్కొన్నారు.. చాలా మందికి ప్రభుత్వ ఉద్యోగం వస్తేనే బాగుండు మంచి ఉద్యోగం వస్తేనే బాగుండు అని అనుకుంటారు. తప్పులేదు అలా అనుకోవడంలో.. కానీ జీవితంలో మొదటి అడుగు పడడం అనేది చాలా ముఖ్యమని పేర్కొన్నారు.సిద్దిపేట దాటి హైదరాబాదులో ఉద్యోగం చేస్తేనే మీకు అనుభవం వస్తుంది. ఉద్యోగం కోసం మీరు ఊరుదాటి వెళితే మీకు ప్రపంచం అర్థమవుతుంది. పోటీ– ప్రపంచంలో నువ్వెక్కడున్నావు, ఎక్కడ నిలబడ్డావు, ముందుకు సాగాలంటే ఏం చేయాలనే విషయాలతో మీ ఆలోచన విధానంలో మార్పు వస్తుంది. కష్టం యొక్క విలువ తెలుస్తుంది డబ్బు విలువ తెలుస్తుందని హరీశ్ తెలిపారు. ఉన్నత ఉద్యోగానికి, ప్రభుత్వ ఉద్యోగానికి ప్రయత్నం చేస్తూ ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోండని యువతకు తెలిపారు. రాష్ట్రంలో ఈరోజు ఏం జరుగుతుందో మీకు తెలవనిది కాదు.. గ్రూప్ వన్ ఎగ్జామ్ పెడితే నిరుద్యోగులు వారి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. లక్షల రూపాయలు ఫలాన మంత్రులు, ఫలాన అధికారులు లంచం అడిగారు అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత నిర్లక్ష్యంగా పరీక్ష నిర్వహిస్తారా అని స్వయంగా హైకోర్టు ప్రభుత్వంపై మొట్టికాయలు వేసింది. నిజంగా తప్పు చేయకపోతే ముఖ్యమంత్రి సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి. అవినీతికి పాల్పడ్డ వారిని శిక్షించాలి. తప్పును సరిదిద్దకుండా మరో అప్పీల్‌కి పోదామని చెప్పడం మూర్ఖత్వం. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామన్నారు. రెండేళ్లు పూర్తకావస్తున్నాయి. 2 లక్షలు ఉద్యోగాలు ఏమయ్యాయి రేవంత్ రెడ్డి? రాహుల్ గాంధీని అశోక్ నగర్ చౌరస్తాలో కూర్చోబెట్టి మాటిచ్చారు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని.. ఏమైంది?‘ అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉద్యోగ నోటిఫికేషన్ వేసింది కేసీఆర్.. పరీక్ష నిర్వహించింది కేసీఆర్.. ఇంటర్వ్యూ నిర్వహించింది కేసీఆర్.. కేవలం ఉద్యోగ పత్రాలు ఇచ్చింది మాత్రం రేవంత్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో గట్టిగా నిలదీస్తే చర్చ పెట్టకుండా ఒక అంశాన్ని బట్టి జాబ్ క్యాలెండర్ అని పారిపోయారు. జాబ్ క్యాలెండర్ కాదు అది జాబ్ లెస్ క్యాలెండర్.. ప్రియాంక గాంధీతో హుస్నాబాద్ సభలో చెప్పించారు.. నిరుద్యోగ యువతకు నాలుగువేల నిరుద్యోగ భృతి ఇస్తామని. ఏమైంది.? ప్రభుత్వం నిరుద్యోగ యువతని పూర్తిగా మోసం చేసింది. మీ పక్షాన మేము పోరాటం చేసి అసెంబ్లీలో ప్రశ్నిస్తాము. మీకు న్యాయం జరిగే వరకూ కృషి చేస్తామని హరీశ్ అన్నారు. వెటర్నరీ కాలేజ్ ని సిద్దిపేటలో పెడితే రేవంత్ రెడ్డి కొడంగల్ కి తరలించారు. సిద్దిపేటకు అన్యాయం చేశారు. వెయ్యి పడకల ప్రభుత్వ ఆసుపత్రి కట్టించాము. 90శాతం పని పూర్తయింది. ఆ చిన్న పనిని కూడా చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది. ఈ ప్రభుత్వం పాజిటివ్ డైరెక్షన్ కంటే నెగటివ్ డైరెక్షన్ లో ఎక్కువ వెళ్తుందని హరీశ్ పేర్కొన్నారు. మరిన్ని జాబ్ మేళాలు మీకోసం ఏర్పాటు– చేస్తామని యువతకు భరోసా కల్పించారు. మొన్న నేను లండన్ కి వెళ్ళినప్పుడు కూడా మన ఐటీ–టవర్లో కంపెనీలు ఏర్పాటు– చేయాలని అక్కడ ఉన్న తెలంగాణ బిడ్డలను కోరడం జరిగింది. ఈసారి ఎంతమందికి అవకాశం వస్తే అంతమంది ఉద్యోగాల్లో చేరాలని కోరుతున్నాను. దాదాపు 30 కంపెనీలు మీకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఇక్కడికి వచ్చాయి. మీ ఆలోచన సిద్దిపేట నుండి హైదరాబాద్‌కి పరిమితం కావద్దు. ముంబై కో, ఢిల్లీ అక్కడి నుండి ప్రపంచవైపుకు సాగాలి. ఇతర దేశాల్లో మన దగ్గర నుంచి వెళ్లిన పిల్లలు చదువుతూ చిన్న ఉద్యోగం అయినా చేస్తూ వారి కలలను సహకారం చేసుకుంటారు. ఇక్కడ మనమూ ఈ జాబ్ చేయాలా అంటే చిన్న ఉద్యోగం చేయాలనే అనుకుంటాం కానీ అక్కడ ఉద్యోగం చేయడమే గౌరవంగా భావించి చిన్నదైనా, పెద్దదైన చేస్తూ వారి లక్ష్యాన్ని సాధిస్తారు. మీరు కూడా మొదటి అడుగు వేయండి. పోటీ– ప్రపంచంతో పోటీ–పడి జీవితంలో మిమ్మల్ని మీరు సాధించండని హరీశ్ యువతకు హరీశ్ మార్గదర్శనం చేశారు.

# మణిపూర్‌లో ఇప్పుడా పర్యటించేది

(మొదటి పేజీ తరువాయి)

స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి అందరు ప్రధానులు ఇదే పాటించారని తెలిపారు. కానీ, మోదీ మాత్రం రెండేళ్ల తర్వాత దీన్ని పాటిస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. ఆయన ఇప్పటికే అక్కడ పర్యటించి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు.ఇక, మోదీ పర్యటనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా తీవ్ర విమర్శలు చేశారు. కాగా.. ప్రస్తుతం ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో ఉన్న మోదీ మిజోరం రాజధాని ఆయిజోల్ కేంద్రంగా రూ.8,071 కోట్లతో కొత్తగా నిర్మించిన 51.38 కి.మీ. పొడవైన రైలు కారిడార్‌ను ప్రారంభించారు. ఈ పర్యటన దృష్ట్యా మణిపుర్ ప్రభుత్వం కట్టు–దిట్టమైన భద్రతా ఏర్పాట్లు– చేసింది.


# యూపిపిఎస్సీ తరహాలో జాబ్ క్యాలెండర్

(మొదటి పేజీ తరువాయి)

ఎన్. రాంచందర్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగులు ఆమరణ నిరాహార దీక్షకు దిగక ముందే నోటిఫికేషన్ల విషయంలో స్పష్టత ఇవ్వాలని ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ డిమాండ్ చేశారు. గ్రూపు 1, గ్రూపు 2 పరీక్షలు పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. వేలాది మంది నిరుద్యోగులు హైదరాబాద్, అశోక్ నగర్ లైబ్రరీ వద్ద,అఫ్జల్‌గంజ్ లైబ్రరీ వద్ద ఇంకా వివిధ ఇనిస్టిట్యూట్స్ వద్ద రాత్రింభవళ్ళు చదువుతూ ఉద్యోగాల కోసం వేచి చూస్తున్నారని ఆయన తెలిపారు. గతంలో బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగులకు అన్యాయం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తున్నదని ఆయన విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 30 వేల ఉద్యోగాలు ఇచ్చాం, 70 వేల ఉద్యోగాలు ఇచ్చామంటూ మాటలు చెప్పడమే తప్ప నియామకాలకు సంబంధించి లెక్కలు చూపించడం లేదని ఆయన విమర్శించారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి ఆ ప్రకారం నియామకాలు చేపట్టాలని రాంచందర్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# తెలంగాణ విమోచన దినోత్సవాలకు రక్షణశాఖ మంత్రి రాజనాథ్ సింగ్







**• మోడీ నాయకత్వంలో భారత్ బలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుదల • జీఎస్టీ దేశ చరిత్రలో మైలురాయి సంస్కరణ • రైతాంగాన్ని రోడ్డున పెట్టిన కాంగ్రెస్ పాలనఫసల్ బీమా .. రైతు బతుకుకి రక్షణ కవచం • భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకులు, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల కో ఇన్చార్జ్ పొంగులేటి సుధాకర్ రెడ్డి.**

**ఖమ్మం, సెప్టెంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):**తెలంగాణ విమోచన దినోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు భారతీయ జనతా పార్టీ రాష్ట్రవ్యాప్తంగా వారం రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టనుందని ఆ పార్టీ జాతీయ నాయకుడు, తమిళనాడు – తెలంగాణ రాష్ట్రాల ఇన్‌ఛార్జ్ పొంగులేటి సుధాకర్ రెడ్డి వెల్లడించారు. ఈ వేడుకలకు రక్షణశాఖ మంత్రి రాజనాథ్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. శనివారం ఖమ్మం జిల్లాలో పర్యటించారు. .ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు గోలి మధుసూదన్ రెడ్డి తతో కలిసి తిరుమలయ్యపాలెం మండలంలోని సుబ్లేడులో షోయబుల్లా ఖాన్ విగ్రహాన్ని ఆవిష్కరించినారు.ఆయన త్యాగాలు పాఠ్యాంశాల్లో చేర్చాలని పొంగులేటి కోరారు. పాత్రికేయుల విలువలు నిలబెట్టిన ఖాన్ స్ఫూర్తి సమాజానికి దారి చూపుతుందని పేర్కొన్నారు. పల్లెటూరి జర్నలిస్టుల సహాయ నిధికి తన వంతు సహాయంగా పది వేల రూపాయలు అందజేస్తున్నట్లు ప్రకటించారు. **కాంగ్రెస్ ద్వంద్వ స్వభావం** ఉపరాష్ట్రపతి ప్రమాణస్వీకారానికి కాంగ్రెస్ హాజరు కాకపోవడాన్ని తీవ్రంగా ఎద్దేవా చేసిన పొంగులేటి, రాహుల్ గాంధీ రాజ్యాంగంపై మాటలు మాట్లాడుతూనే ఇలాంటి నిర్ణయం తీసుకోవడం వారి ద్వంద్వ స్వభావానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. తెలంగాణలో మూడు మంత్రులు ఖమ్మం జిల్లాకు చెందిన వారే అయినా, ప్రజలకు గిట్టుబాటు కాని పాలననే కొనసాగిస్తున్నారని విమర్శించారు. **మోడీ నాయకత్వంలో బలమైన భారత్** ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా దేశవ్యాప్తంగా 'సుశాసన కార్యక్రమాలు' చేపట్టి, ఆయన 11 ఏళ్ల పాలనలో సాధించిన విజయాలను ప్రజలకు చాటుతామని పొంగులేటి తెలిపారు. మోడీ ఆధ్వర్యంలో భారత్ బలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతోందని, అంతర్జాతీయ సంక్షోభాల నడుమ కూడా భారత్ అభివృద్ధి దిశగా దూసుకుపోతోందని అన్నారు. ఫ్రాన్స్, బంగ్లాదేశ్, పాకిస్తాన్, శ్రీలంక వంటి దేశాలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన వేళ, మోడీ నేతృత్వం భారత్‌ను కొత్త ఎత్తులకు చేర్చిందని వివరించారు.**దేశంలో జీఎస్టీ చారిత్రక సంస్కరణ** జీఎస్టీ అమలు దేశ చరిత్రలో మైలురాయిగా నిలిచిందని పొంగులేటి పేర్కొన్నారు. 140 కోట్ల భారతీయులు ఏదో ఒక విధంగా దానితో ప్రయోజనం పొందుతున్నారని తెలిపారు. ఓడిపోయిన స్థానాల్లోనే కాంగ్రెస్ ఎన్నికల దందా ఆరోపణలు చేయడం ప్రజాస్వామ్యాన్ని అవమానపరచడమేనని తీవ్రంగా విమర్శించారు. **రైతాంగాన్ని రోడ్డున పెట్టిన కాంగ్రెస్ పాలన.** రాష్ట్రంలో నెలకొన్న యూరియా సంక్షోభానికి కాంగ్రెస్ పాలనకే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని పొంగులేటి ఆరోపించారు. రైతులు పంట పొలాల్లో కాకుండా ఎరువుల కోసం రోడ్లపై క్యూలలో నిలబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "పండుగ లేదు.. పబ్బంలేదు.. ఎండలేదు.. వానలేదు.. కానీ రైతు రాత్రింబవళ్లు ఎరువుల క్యూలలో నిలబడి అలసిపోతున్నాడు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆధార్, పాసుబుక్ చేతబట్టుకొని రైతులు పడుతున్న ఇబ్బందులు చూస్తుంటే గుండె తరుక్కుపోతుందని వ్యాఖ్యానించారు.**యూరియా దారిమళ్లింపులో కాంగ్రెస్ నేతల పాత్ర.** కేంద్రం నుంచి రాష్ట్రానికి సరఫరా చేసిన యూరియాను దారి మళ్లించి, రైతులను ఇబ్బందుల్లోకి నెట్టేసిన కాంగ్రెస్ నేతలు, తిరిగి కేంద్రంపై నిందలు వేయడం బాధాకరమని ఆయన మండిపడ్డారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వైఫల్యమే రైతు సమస్యలకు కారణమని ఆరోపించారు. "మంత్రులు కాంట్రాక్టర్లు, కాంట్రాక్టర్లు మంత్రుల్లా మారిపోయారు. ఇది కాంగ్రెస్ వ్యాపార రాజకీయాల పరాకాష్ఠ" అని వ్యాఖ్యానించారు.**ఫసల్ బీమా రైతు రక్షణ కవచం.** రైతు సమస్యలపై ప్రత్యక్షంగా స్పందించిన పొంగులేటి, మహిళా రైతులకు ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన వివరాలు తెలియజేశారు. స్వల్ప ప్రీమియం చెల్లిస్తే మిగతా భారం కేంద్రం భరిస్తుందని, పంట నష్టపోతే నష్టపరిహారం నేరుగా రైతు బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని వివరించారు. సహజ విపత్తులు, కరువు, వడగండ్ల వాన కారణంగా పంట నష్టపోయినా ఈ పథకం రైతు బతుకుకు రక్షణ కవచంలా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు , పాలేరు అసెంబ్లీ కాంటెస్ట్ అభ్యర్థి నన్నా రవికుమార్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొంగల సత్యనారాయణ , రాష్ట్ర నాయకులు జి వెంకటేశ్వర్లు, మందడపు సుబ్బారావు ,దుద్దుకూరి వెంకటేశ్వర్లు, మందడపు ప్రభాకర్ రెడ్డి , గుత్తా వెంకటేశ్వర్లు, సుదర్శన్ మిశ్రా, నల్లగట్టు ప్రవీణ్ కుమార్, రవి రాథోడ్ , విజయ రెడ్డి, రజినీ రెడ్డి , నెల్లూరి బెనర్జీ, నగరికంటే వీరభద్రం మండల కన్వీనర్ ఇందూరి మహేష్‌లు పాల్గొన్నారు.

# సిపిఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు

**తెలంగాణ సాయుధ పోరాటం ముమ్మాటికి కమ్యూనిస్టులదే**

**తెలంగాణ విలీన దినోత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి, పోరాట చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని డిమాండ్.**

**ఆత్మ కమిటీ చైర్మన్ సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులునల్లు సుధాకర్ రెడ్డి**




**కురవి, సెప్టెంబర్13(పీసీడబ్ల్యూ న్యూస్):**కమ్యూనిస్టుల నాయకత్వంలోనే నాటి వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగిందనేది చరిత్ర చెప్పే వాస్తవమని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు.కురవి మండలంఅయ్యగారిపల్లి గ్రామంలో సిపిఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా అమరవీరుల స్థూపం వద్ద అరుణపతకాన్ని ఎగురవేసి, జోహార్లు అర్పించి, సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ నిజాం నిరంకుశపాలన పై, రజాకార్ల అకృత్యాలపై, దొరల దేశ్ముక్ ల దౌర్జన్యాల పై కమ్యూనిస్టుల నాయకత్వంలో కోనసాగి, నాల్గు వేల మంది కార్యకర్తల భలిదానలతో ,10 లక్షల ఎకరాల భూమి పేదలకు పంచి, వేలాది గ్రామాలను భూస్వాముల కబంధహస్తాల నుండి విముక్తం చేసి, నిజాం పాలన అంతానికి చరమ గీతం పాడి, భారత్ లో విలీనం అయ్యేవిధంగా పోరాడిన ఘన చరిత్ర కేవలం కమ్యూనిస్టులది మాత్రమే నని, బీజేపీ లాంటి పార్టీలు మసి పూసి మారేడు కాయలు అమ్మెవిధంగా చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేయడాన్ని తెలంగాణ ప్రతి బిడ్డ తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు తెలంగాణ విలీన దినోత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి, పోరాట చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని డిమాండ్ చేశారు .సిపిఐ సీనియర్ నాయకులు కందుల యాకయ్య అరుణ పతకాన్ని ఎగుర వేయగా, మండల కార్యదర్శి కరణం రాజన్న, సహాయ కార్యదర్శి బుర్ర సమ్మయ్య, బోల్లు వెంకన్న, గజ్జి చంద్రయ్య,కన్నె వెంకన్న, నర్సింగం గురువయ్య ,కలగూర నాగరాజు, బుడేగే పిచ్చయ్య, వెంకన్న, నల్లు మధుసూదన్ రెడ్డి, నరేందర్ రెడ్డి,సూర్యనారాయణ, యాకన్న తదితరులు పాల్గొన్నారు.







## మల్టీ-పర్పస్ పార్క్‌లోని ధాబాను రద్దు చేసిన కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్...

**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):** నగరంలోని ముఖరంపుర ఇందిరచౌక్ లోగల మల్టీ-పర్పస్ పార్క్‌లోని ధాబాను రద్దు చేసిన కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్, కాంట్రాక్ట్ ప్రకారం క్యాంటీన్ మాత్రమే అనుమతించబడిందని పేర్కొంది.తెలంగాణ చౌక్ సమీపంలోని మల్టీ-పర్పస్ పార్క్‌ను నిర్దేశించిన నియమాలు మరియు షరతులకు అనుగుణంగా, టెండర్ ప్రక్రియ ద్వారా దానిని ఒక ప్రైవేట్ ఏజెన్సీకి లీజుకు ఇచ్చింది. పార్క్ ప్రాంగణంలో, క్యాంటీన్‌ను ఏర్పాటు చేయడానికి మరియు నిర్వహించడానికి మాత్రమే అనుమతి ఇవ్వబడింది.అయితే, సంబంధిత కాంట్రాక్ట్ ఏజెన్సీ ఒప్పందం నిబంధనలకు విరుద్ధంగా, పార్క్ లోపల ఒక హోటల్ మరియు ధాబాను ఏర్పాటు చేసి నిర్వహించడం ద్వారా నియమాలు మరియు షరతులను ఉల్లంఘించింది. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు నిర్వహించిన తనిఖీల సమయంలో ఈ ఉల్లంఘనను గుర్తించారు. అందువల్ల, అనధికార ధాబాను రద్దు చేశారు. మల్టీ-పర్పస్ పార్క్‌లో ఎటువంటి ధాబా కార్యకలాపాలను అనుమతించబోమని కాంట్రాక్టర్ యాజమాన్యానికి స్పష్టమైన సూచనలు జారీ చేయబడ్డాయి. టెండర్ నిబంధనల ప్రకారం, ఏజెన్సీకి క్యాంటీన్‌ను మాత్రమే నిర్వహించడానికి ఖచ్చితంగా అనుమతి ఉంది మరియు వారికి తదనుగుణంగా హెచ్చరించబడింది.పార్కులు కుటుంబాలు మరియు ప్రజలు విశ్రాంతి తీసుకోవడానికి మరియు ఆనందించడానికి ఉద్దేశించబడ్డాయి. అందువల్ల, అటువంటి వినోద ప్రదేశాలలో అనధికార ధాబాలు లేదా వాణిజ్య సెటప్‌లు అనుమతించబడవు. అటువంటి సంస్థలు కనుగొనబడితే, వాటిని వెంటనే తొలగించి రద్దు చేస్తారు మరియు మున్సిపల్ కార్పొరేషన్ తగిన చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

# పల్లెల్లో అంతర్గత రోడ్లతో రవాణా సౌకర్యం మెరుగు





**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు.**

**చిట్యాల, సెప్టెంబర్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండలంలోని వివిధ గ్రామాల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పర్యటించారు. సుమారు రూ.903 లక్షల వ్యయంతో వివిధ గ్రామాల్లో గ్రావెల్ రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఒడితల నుండి మొరంచవాగు వరకు రూ.50 లక్షలు మరియు ఆర్ అండ్ బీ రోడ్డు ఒడితల నుండి బద్దిపోచమ్మ ఆలయం వరకు రూ.50 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు, జడల్ పేట గ్రామంలో జడల్ పేట నుండి పాసిగడ్డ తండా వరకు రూ.162 లక్షలు రోడ్డు నిర్మాణ పనులు, రామచంద్రాపూర్ గ్రామం నుండి శాంతినగర్ వరకు రూ.30 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు, పంచాయతీ రాజ్ రోడ్డు గుంటూరుపల్లి నుండి చిట్యాల రోడ్డు వరకు రూ.144 లక్షలు రోడ్డు నిర్మాణ పనులు, చింతకుంటరామయ్యపల్లి గ్రామం నుండి శాంతినగర్ వరకు రూ.100 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు, నైన్ పాక గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు. నాపాక దేవాలయం నుండి మామిడితోట వరకు రూ.40 లక్షలు, ఎస్సీ కాలనీ నుండి మొరంచ బ్రిడ్జి వరకు రూ.20 లక్షలు, చెంచుకాలనీ నుండి పాశిగడ్డ తండా వరకు రూ.207 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు, నాపాక సర్వతోభద్ర ఆలయంలో ఎమ్మెల్యే మొక్క నాటి నీరు పోశారు. అనంతరం రూ.100 లక్షలతో ఆలయంలో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు, అధికారులతో కలిసి శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాలల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామీణ రహదారులు బాగుంటేనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, అందుకోసం ప్రభుత్వ నిధులతో పాటు ఇతర పథకాల ద్వారా కూడా రహదారి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పోలీసులు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు ఉన్నారు.

## ఘనంగా ఆర్ కృష్ణయ్య జన్మదిన వేడుకలు...


**- జాతీయ బీసీ సంక్షేమ సంఘం హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ ఇంగిలే రామారావు**





**జమ్మికుంట,సెప్టెంబర్13(పీసీడబ్ల్యూన్యూస్):** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, పేదల పెన్నిధి, అనునిత్యం బీసీల కోసం పోరాడే వ్యక్తి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఏ రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య జన్మదినం సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ ఇంగిలే రామారావు ఆధ్వర్యంలో స్థానిక డీసీఎంఎస్ కాంప్లెక్స్ లో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ బీసీల సంక్షేమ సారధి, అహర్నిశలు పోరాడే వ్యక్తి ఆర్ కృష్ణయ్య ఇలాంటి పుట్టినరోజు వేడుకలు ఇంకా మరెన్నో జరుపుకోవాలని నిండు నూరేళ్లు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ఆ దేవున్ని మనస్ఫూర్తిగా ప్రార్థించడం జరిగింది .అనునిత్యం ప్రజా సేవలో ఉండాలని ఇంకా ఉన్నతమైన పదవులు అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకోవడం జరిగింది .ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు సలీం ,రమేష్ ,సురేష్, వెంకటేష్ ,మహేందర్, రాజు, లింగయ్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు శాఖకు సున్నీ మర్కజీ మిలాద్ కమిటీ అధ్యక్షుడి కృతజ్ఞతలు..



**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):** మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా నగరంలో ఇటీవల నిర్వహించిన మిలాదున్నబి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందించిన పోలీసు కమిషనర్, ఏసీపీ లకు శనివారం సున్నీ మర్కజీ మిలాద్ కమిటీ అధ్యక్షుడు హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం జామా మస్జిద్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పోలీసు శాఖ ఇచ్చిన గడువు ప్రకారం, సరైన సమయానికి, పోలీసులు సూచనలు పాటిస్తూ, ఎలాంటి ఆటంకాలు లేకుండా మిలాదున్నబి జల్సా, నాత్, దరూద్ కి మహిఫిల్, ఖసీదా బుర్దా షరీఫ్ సదస్సులు నిర్వహించి ఆదర్శంగా నిలిచామన్నారు. ఈకార్యక్రమంలో కమిటీ సభ్యులు మౌలానా ఖయ్యుం జియాయి, మౌలానా సలాహుద్దీన్ మిస్బాహి, అబ్దుల్ కరీం జాహెద్,, యూసుఫోద్దీన్ ఖాద్రి రియాజ్, అబ్బాస్ హుస్సేన్, హాబీబ్ ఖాద్రి, ఆయుబ్ ఖాన్, యూసుఫ్ బేగ్, సోహైల్ రజ్వి తదితరులు పాల్గొన్నారు.

## చలో గద్వాల్..

**బయలుదేరిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**కేటీఆర్‌తో పాటు బయలుదేరిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**

**మాజీ మంత్రులు,ఎమ్మెల్యేలు మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులు**

**షాద్ నగర్, సెప్టెంబర్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):**



శనివారం సాయంత్రం 5 గంటలకు గద్వాల జిల్లా కేంద్రంలో జరుగుతున్న గద్వాల్ గర్జన బహిరంగ సభకు హైదరాబాద్ నుండి బయల్దేరిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరియు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్,లక్ష్మా రెడ్డి,ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సి నవీన్ రెడ్డి,ఎమ్మెల్యే కౌసిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి,జైపాల్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాలొగొన్నారు.

# చలో ప్రజా భవన్ విజయవంతం చేసిన కాంట్రాక్టు కార్మికులకు విప్లవ జేజేలు...

**● సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి ● సమస్యల పరిష్కారానికి మంత్రుల ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి.**




**రామగుండం,సెప్టెంబర్13(పీసీడబ్ల్యూ న్యూస్):** సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులంతా అనేక నిర్బంధాలను దాటుకొని చలో ప్రజా భవన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కాంట్రాక్టు కార్మికులందరికీ జాయింట్ యాక్షన్ కమిటీ విప్లవ జేజేలు తెలియజేస్తుంది. ఈ సందర్భంగా రామగుండం రీజియన్ గోదావరిఖనిలో జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం జరిగింది ఈ సమావేశంలో జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు వేల్పుల కుమారస్వామి , తోకల రమేష్, మద్దెల శ్రీనివాస్, ఈసంపల్లి రాజేందర్ మాట్లాడుతూ సింగరేణిలో కాంటాక్ట్ కార్మికులకు శ్రమతోనే లాభాలు వస్తున్నాయని, వారికి 20 వేల లాభాల వాటా చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన కనీస వేతన జీఓల విడుదలలో కూడా జాప్యం జరుగుతున్నదని ఫలితంగా కాంట్రాక్ట్ కార్మికుల యొక్క వేతనాలు పెరగడం లేదని వారు తెలియజేశారు. ఇతర ప్రభుత్వ పరిశ్రమంలో చెల్లిస్తున్న విధంగా సింగరేణిలో కూడా జీవో కు అదనంగా వేతనాలను చెల్లించాలని దీని మూలంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒక రూపాయి కూడా భారం పడదని వారు తెలియజేశారు. సింగరేణి సాధిస్తున్న లాభాలను కాంట్రాక్ట్ కార్మికులకు శ్రమ ఉన్నదని దానికి అనుగుణంగానే 20 వేలు లాభాల వాటా చెల్లించాలని వారు కోరారు. గతంలో సింగరేణి యాజమాన్యం హామీ ఇచ్చినటువంటి సెలవులు ఈఎస్ఐ, క్యాటగిరి ఆధారంగా వేతనాలు తదితర సమస్యల పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని వారు తెలియజేశారు. కార్మికుల వినతి పై స్పందించిన ఉపముఖ్య మంత్రి సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల యొక్క శ్రమ ఉన్నదని దానికి అనుగుణంగా వారి యొక్క వేతనాలు పెంచేందుకు,లాభాల వాటా పెంచెందుకు, ఇతర అన్ని రకాల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీనికొసం అవసరమైతే అన్ని కార్మిక సంఘాలను పిలిచి యాజమాన్యం సమక్షంలో చర్చలు జరుపుతానని హామీ ఇచ్చారు.ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంతో కలిసి జేఏసీ నాయకత్వం సింగరేణి సి ఎండి ఎన్ బలరాం నాయక్ మరియు కార్మిక శాఖ మంత్రి జి వివేక్ వెంకట స్వామి ని కలిసి సింగరేణి కాంటాక్ట్ కార్మికుల సమస్యలు కనీస వేతనాలు జి.ఒల పై చర్చించడం జరిగింది. కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి స్పందిస్తూ త్వరలోనే రాష్ట్రంలో కాంట్రాక్ట్ కార్మికుల యొక్క వేతనాలను పెంచుతామని. రాష్ట్ర ప్రభుత్వం పెంచాల్సిన వేతనాలను పెంచిన అనంతరం సింగరేణిలో అదనంగా చెల్లించాల్సిన వేతనాల గురించి చర్చిస్తామని. మిగతా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.సింగరేణి సి ఎండి బలరాం నాయక్ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గైడ్లెన్స్ అనుగుణంగా వేతనాలు అమలు చేస్తామని మిగతా సమస్యలైన ఈఎస్ఐ అమలు, పెయిడ్ హాలిడేస్ , 15 లక్షల నష్టపరిహారం కేటగిరి ఆదారంగా వేతనాలు చెల్లించడం తదితర అంశాలను త్వరలోనే పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు మంత్రులు, సి ఎండి కాంటాక్ట్ కార్మికుల సమస్యలపై స్పందించిన హామీలు ఇచ్చినందుకు సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటి ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఇచ్చిన హామీలను అమలు చేయని , పక్షంలో హామీల అమలు కోసం భవిష్యత్ పోరాటాలకు కార్మికుల సిద్ధంగా ఉండాలని సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ కాంట్రాక్ట్ కార్మికులకు పిలుపునిచ్చింది.ఈ కార్యక్రమానికి సింగరేణి కాంటాక్ట కార్మికుల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

# ఇంటింటికి సంక్షేమ పథకాలను తీసుకెళ్దాం...

**- డివిజన్లలో మీరే కథానాయకులై పనిచేయండి**
**- వార్డు ఆఫీసర్లు,మిగితా అధికారులతో కలిసి అర్హులైన లబ్దిదారులకు న్యాయం జరిగేట్టు చూడండి**
**- ఇందిరమ్మ ఇండ్లు,డబుల్ బెడ్రూం ఇండ్లు అర్హులైనవారుకి చెందే విధంగా పనిచేయండి**
**- ప్రతి ఇంటికి వెళ్ళండి,సంక్షేమ పథకాలు వివరించండి**
**- కార్పొరేషన్ పై కాంగ్రెస్ జండా ఎగరేద్దాం**
**- కష్టకాలంలో పనిచేసిన వారికి పార్టీ అండగా ఉంటుంది అందుకు నేనే ఉదాహరణ**
**- పార్టీ టికెట్లు అధిష్టానం చూసుకుంటుంది,కష్టపడి పని చేసిన వారికి ప్రాధాన్యత ఇస్తుంది**
**- నగర కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు,సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి దిశా నిర్దేశం...**




**కరీంనగర్,సెప్టెంబర్13(పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రతి ఇంటికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందిస్తున్న ప్రజాపాలనను పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ యొక్క చిత్తశుద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్సిపల్ కార్పోరేషన్ పై కాంగ్రెస్ జండా ఎగురవేయాలని సుడా ఛైర్మన్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు.జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన నగర కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశంలో డివిజన్ల అధ్యక్షులకు,ఇంచార్జిలకు నగర కాంగ్రెస్ నాయకులకు పలు విషయాలపై దిశా నిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో ప్రభుత్వం మరియు కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని కరీంనగర్ లో ఉమ్మడి జిల్లా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు,పొన్నం ప్రభాకర్,అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అదేవిధంగా డిసిసి అధ్యక్షుడు డా.కవ్వంపల్లి సత్యనారాయణ కరీంనగర్ ను ఆనుకొని ఉన్న చొప్పదండి శాసన సభ్యుడు మేడిపల్లి సత్యంతో పాటు అందరి పర్యవేక్షణలో కరీంనగర్ కార్పోరేషన్ పై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని దీంట్లో ఎటువంటి సందేహం లేదని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.స్థానిక నాయకులు డివిజన్లలో కథానాయకులై పని చేయాలని అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా చూడాలని ప్రతి ఇంటిని టచ్ చేయాలని నగరంలో భూమి ఉన్న ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే అవకాశం ఉందని డబుల్ బెడ్రూం ఇండ్లు అర్హులకు దక్కేలా చూడాలని బతుకమ్మ చీరలు పంపిణీ లో భాగస్వామ్యం కావాలని నరేందర్ రెడ్డి సూచించారు.పార్టీ కోసం కష్టకాలంలో పనిచేసిన ప్రతి ఒక్కరిని పార్టీ గుర్తిస్తుందని అందుకు నేనే ఉదాహరణ అని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.కార్పోరేటర్ టికెట్లు ఎవ్వరికి ఇవ్వాలో అధిష్టానం చూసుకుంటుందని ఆది ఏఒక్కరి చేతిలో ఉండదని నరేందర్ రెడ్డి అన్నారు.అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎవ్వరమైనా పార్టీ సిద్ధాంతాల ప్రకారం నడుచుకోవలసిందే అని మేము ఎన్నికల్లో పోటీ చేసినప్పటికి పార్టీ పదవులలో ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తూ పనిచేయాల్సిందే అని నాకు ఎటువంటి గ్రూపులు లేవని అందరితో కలిసి నా శక్తి మేరకు పని చేస్తానని అన్నారు.మాజీ శాసన సభ్యుడు ఆరెపల్లి మోహన్ మాట్లాడుతూ పార్టీలో పని చేసిన వారికి అక్కడక్కడ పోటీ చేసే అవకాశం రాకపోయినా వారికి తగిన ప్రాధాన్యత ఇచ్చి వేరే రకంగా పార్టీ అయినా అవకాశం కల్పిస్తుందని నేను నలభై ఏళ్లుగా గమనిస్తున్నానని అన్నారు.ఈ సమావేశంలో పలువురు డివిజన్ల భాధ్యులు మాట్లాడుతూ కొంతమంది అధికారులు కనీస సమాచారం ఇవ్వడం లేదని మాజీ కార్పొరేటర్లు చెప్పినట్టే వింటున్నారని నరేందర్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు.ఈ సమావేశంలో సెల్స్ అధ్యక్షులు ఎండి తాజ్,కొరివి అరుణ్ కుమార్,శ్రవణ్ నాయక్,సమద్ నవాబ్,లాయక్,జీడి రమేష్,చర్ల పద్మ,ఖమ్రోద్దీన్,ఎలగందుల మల్లేశం,కుర్ర పోచయ్య,అబ్దుల్ రహమాన్ అన్ని డివిజన్ల అధ్యక్షులు,ఇంచార్జులు ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

## గంగాధరలో అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి....



**గంగాధర, సెప్టెంబర్ 13 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో తేదీ 13/09/2025 రోజున గంగాధర మండల కేంద్రానికి చెందిన తాళ్ళ కార్తిక్ శంకరయ్య, వయస్సు 19 సంవత్సరాలు కలిగిన యువకుడు అనుమానాస్పద రీతిలో మృతి చెందడం జరిగింది. వివరాలలోకి వెళితే తాళ్ళ కార్తిక్ గత కొంతకాలంగా మద్యానికి బానిసై తరచు కుటుంబ సభ్యులతో గొడవ పడుతుండేవాడు. కుటుంబ సభ్యులతో గొడవపడి ఇదివరకు ఒకసారి డిష్ వైర్ తో ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబ సభ్యులు గమనించి ఆసుపత్రికి తీసుకెళ్లి బ్రతికించారు. నిన్న అనగా 12/09/2025 రోజు కార్తీక్ పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసుకున్న తర్వాత కార్తీక్ అతిగా మద్యం సేవించి కుటుంబ సభ్యులతో గొడవ పెట్టుకుంటూ ఆత్మహత్య చేసుకుని చనిపోతాను అంటూ బెదిరించాడు. రాత్రి అందరు పడుకొని ఈరోజు ఉదయం నాలుగు గంటలకు లేచి చూసేసరికి కార్తీక్ ఇంట్లోని గదిలో మరణించి ఉన్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా గంగాధర SI వంశీకృ ష్ణఅను మానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దర్యాప్తులో భాగంగా చొప్పదండి సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్ ,గంగాధర ఎస్సై వంశీకృష్ణ, కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ శేఖర్ రావు వైద్య బృందం కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించడం జరిగింది.



## జయన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం...




**హుజురాబాద్,సెప్టెంబర్13(పీసీడబ్ల్యూ న్యూస్):** హుజురాబాద్ మండలం, పెద్దపాపయ్యపల్లి గ్రామంలో జయన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పేదలకు అండగా నిలవాలన్న లక్ష్యంతో, శంకర కంటి ఆసుపత్రి, హైదరాబాద్ సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి వృద్ధులు పెద్ద సంఖ్యలో వచ్చి తమ కళ్లను పరీక్షించుకున్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్యులు పలు సూచనలు, సలహాలు అందించారు. కంటి చూపు మందగించడం, ఇతర సమస్యలు ఉన్నవారికి చుక్కల మందులు కూడా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా, జయన్న ఫౌండేషన్ ఛైర్మన్ గుడిపాటి సరిత జయపాల్ రెడ్డి మాట్లాడుతూ, కంటి చూపు ఎంతో ముఖ్యమని, సమస్యలు తలెత్తిన వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచించారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని ఎంపిక చేసి, వారికి త్వరలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని ఆమె తెలిపారు. ఈ ఉచిత కంటి శిబిరం పేదలకు ఎంతో ఉపయోగపడిందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

# ఖానపురా ప్రభుత్వ ప్రాథమిక ఉర్దూ పాఠశాలకు కొత్త ఊపిరి







**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):** ఉర్దూ మాధ్యమ విద్యను బలపరిచే దిశగా ఒక చారిత్రాత్మక కార్యక్రమంలో, డాక్టర్ ముస్తాక్ అలీ (ప్రెసిడెంట్, లక్ష్ ఫౌండేషన్, ఎంఎల్‌సి అభ్యర్థి), పీర్ షబ్బీర్ సాహెబ్, సర్వర్ షా బియాబానీ, ప్రభాకర్, రమేశ్, సుటా ప్రతినిధులు, మేధావులు, హెడ్‌మాస్టర్ ముతహరుద్దీన్ మరియు అతని బృందం, ఎన్‌జీఓ ప్రతినిధులు, అలీ కో-కార్పొరేటర్, అరిఫ్ మాజీ కార్పొరేటర్ లతో కలిసి ప్రభుత్వ ప్రాథమిక ఉర్దూ పాఠశాల, ఖానాపురా కొత్త భవనాన్ని ప్రారంభించారు.మునుపటి వరకు ఒక చిన్న గదిలో నడుస్తున్న ఈ పాఠశాల ఇప్పుడు విశాలమైన, విద్యార్థి అనుకూల వాతావరణంలోకి మారింది, ఇది పిల్లల భవిష్యత్తుకు వెలుగునిస్తుంది.డాక్టర్ ముస్తాక్ అలీ మాట్లాడుతూ: "పిల్లల ప్రాథమిక హక్కులు ఎప్పుడూ నిర్లక్ష్యం చేయబడవు. విద్యా హక్కు ఎల్లప్పుడూ మా ప్రధాన ప్రాధాన్యతగా ఉంటుంది" అని పునరుద్ఘాటించారు.పాఠశాల నిరంతర కార్యకలాపాల కోసం లక్ష్ ఫౌండేషన్ ఒక సంవత్సరం అద్దె రూ. 1,50,000 ముందుగానే చెల్లించింది.డాక్టర్ అలీ ముఖ్యమైన విద్యా సమస్యలను ప్రస్తావించి పరిష్కారాలను సూచించారు:డీఎస్సీలో డీ-రిజర్వేషన్ చేసి ఉర్దూ మాధ్యమ ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయడం,ప్రభుత్వ పాఠశాల సదుపాయాల నవీకరణ,ఉర్దూ పాఠశాలలను ప్రతిస్పర్ధాత్మకంగా మరియు భవిష్యత్ దృష్టితో అభివృద్ధి చేయడం.విద్యతో పాటు ఆరోగ్య రంగంలోనూ లక్ష్ ఫౌండేషన్ విస్తరిస్తూ, వచ్చే నెలలో కొత్త కార్యక్రమాన్ని ప్రకటించింది:50 ఓపీ కన్సల్టేషన్,299 కు సమగ్ర వైద్య పరీక్షలు, పేదల ఆరోగ్యానికి సామాజిక సేవగా.కార్యక్రమం చివర్లో సమాజం, ఉపాధ్యాయులు, లక్ష్ ఫౌండేషన్ కలిసి ప్రభుత్వ ఉర్దూ పాఠశాలల పునరుద్ధరణ కోసం మరియు వెనుకబడిన వర్గాల విద్యా, ఆరోగ్యానికి నిరంతరం కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

# యూరియా దొరకక గడ్డిమందు త్రాగిన రైతు నర్సయ్య

● మంత్రి సీతక్క నియోజకవర్గంలో....




**మహబూబాబాద్ కొత్తగూడ, సెప్టెంబర్ 13(పీసీడబ్ల్యూ న్యూస్):** యూరియా దొరకక ఆత్మహత్యాయత్నం చేసుకున్న రైతు నరసయ్యను పరామర్శించిన మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ,కొత్తగూడ మండల కేంద్రం, బూర్క గుంపు కు చెందిన మల్లెల నరసయ్య గత నెల రోజులుగా యూరియా కోసం తిరిగి తిరిగి ఒక్క బస్తా కూడా దొరకక విసిగి పోయిన రైతు, పంట తన కళ్ళముందుటనే నష్టపోతుంటే చూడలేక ఆత్మహత్యాయత్నం చేసుకున్న రైతును శనివారం రాత్రి నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పరామర్శించి ధైర్యాన్ని చెప్పిన మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ.రైతులు ఎవరు అధైర్య పడొద్దు ధైర్యంగా నిలబడి ప్రభుత్వంతో కొట్లాడి పంటలను కాపాడుకోవాలి.రైతులు తమ పంటలను కోల్పోయి అధైర్యపడి ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి రావడానికి ప్రధాన కారణం ప్రభుత్వం అసమర్థతే.స్థానిక మంత్రి సీతక్క తన నియోజకవర్గ రైతులను కాపాడుకునే స్థితిలో లేకపోవడం దురదృష్టకరం.ఇప్పటికైనా రైతులకు అదనంగా యూరియా అందించి పంటలను, రైతులను కాపాడుకోవాలని మంత్రి సీతక్క కి విజ్ఞప్తి చేస్తున్నాను.రైతుల ఈ దుస్థితికి కారణమైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ,స్థానిక మంత్రి సీతక్క వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నాను.ఈ కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి నాయక్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు నాగేల్ వెంకటనారాయణ గౌడ్, కొత్తగూడెం మండల పార్టీ అధ్యక్షుడు వేణు, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి వేనుముద్దుల శ్రీధర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ దేవోజు సదానందం, వార్డ్ అధ్యక్షులు ఇతర మండల పార్టీ నాయకులు క్లస్టర్ బాధ్యతలు పాల్గొన్నారు.

# మేము సమాజానికి సేవ చేయడంలో ముందు ఉంటా...

● అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం ఈ మూడు నినాదాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్తాము.

● స్వేరో నేటట్ వర్క్ జిల్లా అధ్యక్షుడు బిబికె రాజు స్వేరో.






**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి జిల్లా స్వేరోస్ నెట్ వర్క్ సభ్యులు గుంతపల్లి ప్రకాష్ స్వేరో తన 30 వ పుట్టిన రోజు సందర్భంగా మూడు వందల మంది పేషెంట్లలకు స్థానిక ప్రభుత్వ హాస్పిటల్లో పండ్లు పంపిణీ చేశారు.స్వేరోస్గా మేము సమాజానికి సేవ చేయడంలో ముందు ఉంటామని రాబోయే రోజుల్లో నెట్వర్క్ తరపున అనేక సేవా కార్యక్రమాలు చేస్తామని నెట్వర్క్ స్పోక్స్ పర్సన్, జిల్లా నాయకులు మల్లేష్ గౌడ్ స్వేరో అన్నారు. అక్షరం ఆరోగ్యం ఆర్థికం ఈ మూడు నినాదాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్ళి సమాజాన్ని మహనీయులు చూపిన మార్గంలో తీసుకెళ్ళే ప్రయత్నం చేస్తామని జిల్లా అధ్యక్షుడుబి బి పేట్ కె రాజు స్వేరో అన్నారు.

# టీ న్యూస్ ఖమ్మం ప్రతినిధి సాంబశివరావు కుటుంబ సభ్యులను ఎంపీ వద్ది రాజ్ పరామర్శ

● చరవాణి సహాయంతో కేటీఆర్ పరామర్శ




**ఖమ్మం, సెప్టెంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):**పోలీసులు అక్రమ కేసు బనాయించి వేధింపులకు గురి చేస్తున్న టీ న్యూస్ ఖమ్మం జిల్లా ప్రతినిధి వెన్న బోయిన సాంబశివరావు కుటుంబ సభ్యులను రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పరామర్శించి తాము కొండంత అండగా ఉంటామని భరోసానిచ్చారు. యూరియా కోసం అగచాట్లు పడుతున్న రైతుల గురించి వార్తలు సేకరిస్తున్న సాంబశివరావుపై ఖమ్మం జిల్లా కొణిజర్ల పోలీసులు అక్రమ కేసు బనాయించడం తెలిసిందే.ఈ సందరరేగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర శనివారం మధ్యాహ్నం ఖమ్మం బంగారయ్య నగర్ లోని సాంబశివరావు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఎంపీ రవిచంద్ర పార్టీ కార్యనిర్వహక అధ్యక్షులు కే.టీ.రామారావుకు చరవాణి సహాయంతో సాంబశివరావు సతీమణి శ్రీదేవితో మాట్లాడించారు. పోలీసు కేసుతో అధైర్యపడవద్దని, తమతో పాటు బీఆర్ఎస్ కొండంత అండగా ఉంటుందని శ్రీదేవిని కేటీఆర్ పరామర్శిస్తూ భరోసానిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ద ృష్టికి తీసుకెళ్లే,ప్రశ్నించే,వార్తలు రాసే,ప్రసారం చేసే విలేకరుల పై,సోషల్ మీడియా వారియర్స్, సామాజిక కార్యకర్తలపై పోలీసులు అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురి చేయడం పరిపాటిగా మారిందని కేటీఆర్ ఆవేదన చెందారు. ఇలాంటి పరిస్థితుల్లో అధైర్యపడకుండా, పిల్లలు కలత చెందకుండా చూసుకోవాలని, మీ కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని కేటీఆర్, రవిచంద్రలు సాంబశివరావు సతీమణి శ్రీదేవి,అత్త మల్లమ్మ, కూతురు సహస్రలకు ధైర్యం చెప్పారు.

# యువకులు రాజకీయంగా ముందుకు రావాలి

● గ్రామాల అభివృద్ధి జరగాలి: రాణా ప్రతాప్ రెడ్డి




**నర్సంపేట సెప్టెంబర్ 13(పీసీడబ్ల్యూ న్యూస్):** నర్సంపేట నియోజకవర్గం, నర్సంపేట మండలం,ఇప్పల్ తండాకి చెందిన యువకులు బానోత్ సాగర్,బానోత్ నూతన్, ధరావత్ అనిల్,పితావత్ సునీల్,అజ్మీరా రాజుకుమార్,జాటోత్ నవీన్,ధరావత్ అఖిల్,ధరావత్ జగన్,బానోత్ లోకేష్,ధరావత్ సంజు,జాటోత్ సుమన్,బానోత్ ఈశ్వర్ మండల ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి రాము,సొనబోయిన సిద్దు ఆధ్వర్యంలో,మండల అధ్యక్షులు తనుగుల అంబేద్కర్ అధ్యక్షతన భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా, గోగుల రాణా ప్రతాప్ రెడ్డి సమక్ష్యంలో బిజెపి పార్టీలో చేరారు.ఈ సందర్భంగా రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ బిజెపి దేశంలో సాధిస్తున్న పురోగతి,జాతీయవాద సిద్ధాంతం నచ్చి,ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వానికి ఆకర్షితులై,పేద - బడుగు-బలహీన వర్గాల కోసం అయన చేస్తున్న సేవను,తెలంగాణ రాష్ట్రంలో మోదీ పై, బిజెపి పై ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను గుర్తించి పార్టీలోకి విచ్చేస్తున్నారు..తెలంగాణలోని గ్రామ పంచాయితీలకు,ఎంపీటీసీ, జడ్పిటీసీలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి పడకేసింది,ఓడిపోతామన్న భయంతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా కూడా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి వెనకడుగు వేస్తుంది.కానీ ఎప్పుడు ఎన్నికలు వచ్చినా,ఎదుర్కోవడానికి బిజెపి సిద్ధంగా ఉందని ,యువకులను రాజకీయంగా ముందుకు తీసుకెళ్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కో కన్వీనర్ కట్ల రాంచందర్ రెడ్డి ,జిల్లా కౌన్సిల్ మెంబర్ గంగిడి మహేందర్ రెడ్డి ,మండల ఉపాధ్యక్షులు బోయిని సుధాకర్,నర్సంపేట నియోజకవర్గ కన్వీనర్ ఆముదాల రమేష్ ,బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఎర్ర రాజు,బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పురాణీ దేవేందర్,సుమన్,లక్ష్మణ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# జమియతుల్ ఉలేమా జిల్లా ఉపాధ్యక్షుడిగా ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్ ఎన్నిక...




**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):** జమీయతుల్ ఉలేమా ఏ హింద్ మౌలాన మహమూద్ మదని గ్రూప్ కు సంబంధించిన కరీంనగర్ జిల్లా ఎన్నికలు శనివారం నగరంలోని మస్జిదే దస్తగీర్ లో నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా నగరానికి చెందిన ప్రముఖ ఇస్లామియ ధార్మిక పండితుడు, రేకుర్తి మదర్సా అరబియా హిఫ్జుల్ ఖురాన్ కరస్పాండెంట్ ముఫ్తి మహమ్మద్ ఘియాస్ మొహియుద్దీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు గా ముఫ్తి యునూస్ ఖాస్మి, కార్యదర్శిగా ముఫ్తి సాధిఖ్ హుస్సేన్, కోశాధికారిగా హాఫిజ్ సయ్యద్ రిజ్వాన్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హుజురాబాద్ అధ్యక్షుడు గా హాఫిజ్ ఇమ్రాన్ బేగ్, జమ్మికుంట అధ్యక్షుడు గా మౌలానా నజీర్ ఖురేషి లను ఎన్నుకున్నారు. ముఫ్తి ఘియస్ మొహియుద్దీన్ ఎన్నిక పట్ల హాఫిజ్ అహ్మద్ హిఫ్జి, కలీమ్ షరీఫ్, ముకరం, తౌహీద్, రాఫె, ఇందుర్తి మస్జిద్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ రఫీ, ముఫ్తి ఇంతియాజ్ అసాధి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ యాత్రాధానం మానవ సంబంధాల వారధి మానవత్వపు బహుమతి



**నర్సంపేట సెప్టెంబర్ 13,(పీసీడబ్ల్యూ న్యూస్):** ఆర్టీసీ యాత్రాధానం మానవసంబంధాల వారధిమానవత్వపు బహుమతి సందర్భంగా నర్సంపేట డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మీ దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి "యాత్రాదానం" అనే మహొూన్నత కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరుతున్నాం. ఈ కార్యక్రమం ద్వారా అనాథలు, నిరాశ్రయ వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేద విద్యార్థులు ప్రసిద్ధ దేవాలయాలు, పర్యాటక ప్రదేశాలు, విహారయాత్రలకు వెళ్లే అవకాశం పొందుతారు. సంతోషకరమైన రోజుల్లో ఈ యాత్ర ద్వారా ఇతరులలోనూ ఆనందాన్ని పంచుకోవ చ్చు.సమాజహితానికి ప్రజాప్రతినిధులు, కార్పొరేట్ సంస్థలు, ఎన్జీవోలు ఈ యాత్రాదానం కార్యక్రమాన్ని వినియోగిం చుకోవాలని కోరుతున్నాం. ప్రజలకు మెరుగైన రవాణా సేవలను అందించడంతో పాటు సామాజిక బాధ్యత గల సంస్థగా ముందుకు వచ్చి యాత్రాదానం కార్యక్రమాన్ని ఆర్టీసీ ప్రారంభించింది. యాత్రాదానం బస్సుల బుకింగ్ కోసం నర్సంపేట డిపో 9959226052, 9866314253 నెంబర్లను సంప్రదించగలరని డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మీ గారు తెలిపినారు.

# ఆదిరెడ్డి భౌతిక దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన బిఆర్ఎస్ నాయకులు చింతల

**యాదాద్రి సెప్టెంబర్ 13,(పీసీడబ్ల్యూ న్యూస్):** బిఆర్ఎస్ పార్టీ మాజీ కౌన్సిలర్ మాజీ పట్టణ అధ్యక్షుడు గొమారి సుధాకర్ రెడ్డి తండ్రి గొమారి ఆదిరెడ్డి శనివారం ఉదయం స్వర్గస్థులయ్యారు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి మరియు తాజామాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి భువనగిరి పట్టణ హుస్నాబాద్ లోని వారి నివాసానికి వెళ్ళి ఆది రెడ్డి భౌతిక దేహంపై పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించడం జరిగింది.



# యూరియా సరఫరా (పంపిణీ) పై సమీక్ష సమావేశం

**● జిల్లాలో పకడ్బందీగా యూరియా పంపిణీ, మండల స్థాయిలో కోఆర్డినేషన్ సమావేశాలు నిర్వహించాలి ● జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**





**మహబూబాబాద్ జిల్లా సెప్టెంబర్ 13(పి.సి.డబ్ల్యూ న్యూస్):** శనివారం మహబూబాబాద్ కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని విజయనిర్మల, సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దారులు, ఎంపీడీవోలు,వ్యవసాయ శాఖ అధికారులతో యూరియా సరఫరా పై జిల్లా యంత్రాంగం తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, సమీక్ష సమావేశం నిర్వహించారు,ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా పంపిణీ చేయుటకు ఇప్పటికే వేసుకున్న ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని, క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్క ఉద్యోగి రైతు వేదికలు, ప్రాథమిక సహకార సొసైటీలు, తదితర కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో కచ్చితంగా ఉండాలని, రైతులకు వస్తున్న స్టాక్ వివరాలను తెలియపరచి వారిని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు వచ్చే విధంగా ముందస్తు సమాచారం ఇవ్వాలని, ఇప్పటివరకు యూరియా అందని రైతుల వివరాలను సేకరించి వారికి యూరియాలు సరఫరా చేయాలని, కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల సౌకర్యార్థం త్రాగునీరు, టెంట్స్, చైర్స్ , సదుపాయాలు కల్పించాలని, క్షేత్రస్థాయిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, యూరియా పంపిణీ విధులలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు, సోషల్ మీడియా,వివిధ సామాజిక మాధ్యమాలలో యూరియా రాదేమో అని, కొన్నిచోట్ల అసత్య ప్రచారాలు జరుగుతున్నాయని, అలాంటి అసత్య ప్రచారాలను మండల స్థాయి లలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు, ఇప్పటికే (18) మండల ప్రత్యేక అధికారులు, వ్యవసాయ, సహకార, సంఘాల ద్వారా సరఫరా చేయడం జరుగుతుందనీ, క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించాల్సిన ఉద్యోగులకు లిఖితపూర్వకంగా ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు,మండల స్థాయి యూరియా పంపిణీ కోఆర్డినేషన్ కమిటీ సమావేశాలు నిర్వహించి పక్కాగా యూరియా పంపిణీ చేయాలన్నారు,ప్రస్తుతం ఉన్న కొనుగోలు కేంద్రాలతో పాటు అదనపు కొనుగోలు కేంద్రాల నిర్వహణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, రద్దీ ఎక్కువగా ఉన్నచోట అదనపు క్యూ లైన్ లను ఏర్పాటు చేయడం జరుగుతుందని, పోలీస్ సిబ్బంది ద్వారా రక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుందని,జిల్లాకు రావాల్సిన యూరియా కోట తోపాటు అదనపు యూరియా కోసం రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారుల ద్వారా సంబంధిత సిబ్బంది చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు,యూరియా సరఫరా అయ్యే వాహనాల యొక్క వివరాలను పక్కాగా సమాచారం తెలుసుకొని నిత్యం గమనిస్తూ ఉండాలని అన్నారు.రెవెన్యూ డివిజనల్ అధికారులు నిత్యం కేంద్రాలను తనిఖీ చేస్తూ నివేదికలను సమర్పించాలని ఆదేశించారు.వ్యవసాయ, సహకార, అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో కలిసి ఎలాంటి పొరపాట్లు జరగకుండా ముందస్తు ప్రణాళిక ప్రకారం యూరియా పంపిణీ విజయవంతంగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.ఈ సమావేశంలో తొర్రూరు, మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులు, గణేష్, కృష్ణవేణి,వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు అజ్మీరా శ్రీనివాసరావు, విజయ్ చంద్ర, శ్రీనివాస్,తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మండల వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## బిజెపి మండల విస్తృతస్థాయి సమావేశం

**వైబిఆర్ గార్డెన్లో నిర్వహించిన సమావేశం**

**ముఖ్యఅతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షులు ఉట్కూర్ అశోక్ గౌడ్**



**యాదాద్రి సెప్టెంబర్ 13(పి.సి.డబ్ల్యూ న్యూస్):** భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం సెప్టెంబరు 17ను పురస్కరించుకొని అక్టోబర్ 2 లాల్ బహదూర్ శాస్త్రి జన్మదిన వరకు పక్షం రోజులు సేవా పక్షం కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునివ్వడం జరిగింది.ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులు సేవా పక్షం కన్వీనర్ లోడీ బద్రి గౌడ్ వహించారు. మండల అధ్యక్షులు గజరాజు కాశీనాథ్,జిల్లా కోశాధికారి గుజ్జ సోమనసయ్య ,జిల్లా నాయకులు తడిసిన మల్లారెడ్డి, బొబ్బలి ఇంద్రారెడ్డి, దయ్యాల కుమారస్వామి, బండారు సత్యనారాయణ, బిజెపి నాయకులు రాగటి మచ్చగిరి, బండ సోమయ్య,సూదగాని శ్రీహరి,లోడి వెంకటయ్య,బూడిది నరసింహ,గజ్జెలి మధు,ఆంబోజు ఆంజనేయులు,లోడి మహేష్, బండారు సాయి,ఎడ్ల అనిత, వరలక్ష్మి,వివిధ గ్రామాల భూత్ అధ్యక్షులు,నాయకులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఘనంగా సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల తల్లిదండ్రుల సమావేశం

**జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి మాడిశెట్టి నరసింహస్వామి**





**మహబూబాబాద్ జిల్లా సెప్టెంబర్13 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** శనివారం సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ మహబూబాబాద్ జిల్లా పరిధిలో గల మొత్తం (24) వసతి గృహాలలో పేరెంట్స్ కమిటీ (తల్లిదండ్రుల సమావేశము) ఏర్పాటు చేయడము జరిగినది. అన్ని వసతి గృహాలలో తల్లిదండ్రులు పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొని వారి విలువైన సలహాలు సూచనలు ఇవ్వడం జరిగినది,అట్టి సూచనలు సలహాలు తూచా తప్పకుండా పాటించి భవిష్యత్తులో అన్ని వసతి గృహాలు సజావుగా నడపడానికి ఎంతో తోడ్పడు తున్నవి ఇట్టి వసతి గృహాలలో వసతి గృహ అధికారులు సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బంది, హాస్టల్ సిబ్బంది పాల్గొని విజయవంతము చేయనైనది, ఇట్టి పేరెంట్స్ కమిటీ సమావేశాలు జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి అధికారి ఎం.నరసింహస్వామి, ఎస్సీ బాయ్స్ హాస్టల్ బలపాల, బాలికల హాస్టల్ కురవి , మరిపెడ , లలో స్వయంగా పాల్గొని విజయవంతముగా చేశారు.

## ఆడపిల్ల కాదు చిచ్చర పిడుగు మేధస్వి

**● ఏ టు జెడ్, నెలల పేర్లు రాజధానుల పేర్లు చెప్పడంలో దిట్ట**

**● అనుకున్నది సాధించడంలో ఆడపిల్లలకు సాటి ఎవరూ రారు**



**అంబర్ పేట, సెప్టెంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** అంబర్ పేట్ డివిజన్ పటేల్ నగర్ శ్రీ మహాలక్ష్మి కాలనీలో విజయ్ కల్పన కు జన్మించిన రెండో సంతానమే మేధస్వి చురుగ్గా ముద్దు ముద్దుగా మాట్లాడుతూ అందరినీ ఆకర్షించింది. రెండు సంవత్సరాల వయసులో గబగబా మాట్లాడుతూ ఏ టు జెడ్, నెలల పేర్లు, భారతదేశంలో ఉన్న 29 రాజధానుల పేర్లను గబగబా చెప్పడంలో మేధస్వి కి సాటి లేరు.మేధస్వి తండ్రి కానిస్టేబుల్ గా ఉద్యోగం చేస్తూ ఉద్యోగంలో బిజీగా ఉంటాడని, కల్పన సహధర్మచారిగా ఇంటి పనులను చక్కదిద్దుకుంటూ పిల్లలను చూసుకుంటూ చిన్నప్పటినుండి వారికి కావలసిన తెలివితేటలను పిల్లలకు నేర్పిస్తూ బుడిబుడి మాటలు మాట్లాడే వయసులో ఇలా మేధస్వి కి ఏమి చెప్పినా ఇట్టే మాట్లాడడం చూసి ఏ టు జెడ్, నెలల పేర్లు, రాజధానుల పేర్లు నేర్పియడంతో అడిగిన దానికి ఇట్టే సమాధానం చెప్పడం చూసి అందరూ ఆశ్చర్యానికి లోనయ్యారు. పాఠశాలకు వెళ్లి చదువుకునే పిల్లలు ఇంత చక్కగా అడిగిన దానికి సమాధానం చెప్పడంలో వెనుక ముందు అవుతారని మేధస్వి అలాకాకుండా అడిగిన దానికి ఇట్టే సమాధానం చెప్పడంలో ఆ చిచ్చర పిడుగు కు సాటి ఎవరూ లేరని ముచ్చటించుకోవడం చూస్తుంటే ఇంత చిన్నతనంలోనే రాజధానుల పేర్లు గడగడా చెప్పడం చూస్తే పాఠశాలకు వెళితే అందరిలో నెంబర్ వన్ గా నిలవడం మేధస్వి కి సాధ్యమేనని తల్లిదండ్రులు చెప్పడం చూస్తుంటే నేటి సమాజంలో ఆడపిల్ల అంటే భారంగా భావించే తల్లిదండ్రులు పిల్లలను చిన్నప్పటి నుండే నీతి వాక్యాలు నేర్పియడం అలవాటు చేస్తే రేపు పెద్దయ్యాక సమాజానికి ఉపయోగపడే మార్గదర్శకురాలు గా కావాలని కోరుకుంటున్నామని తల్లిదండ్రులు తెలిపారు.

## సహకార సంఘం ఇన్చార్జిగా ఈగ వెంకటేశ్వర్లు

**- సహకార సంఘం సీఈవో మోడెం సురేష్**



**నెక్కొండ సెప్టెంబర్ 13(పి.సి.డబ్ల్యూ న్యూస్):** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని నెక్కొండ మండల సహకార సంఘానికి అసిస్టెంట్ రిజిస్టర్ గా వరంగల్ ఈగ వెంకటేశ్వర్లు శుక్రవారం సాయంత్రం 6 గంటలకు బాధ్యతల స్వీకరించారు. వారిని సహకార సంఘం తరపున శుభాకాంక్షలు తెలియజేసి స్వాగతించడం జరిగింది. పాల్గొన్న సీఈవో మోడెం సురేష్ మరియు సహకార సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

## సీరోలు రెవిన్యూ కార్యాలయంలో యూరియా పంపిణీపై మండల స్థాయి ప్రణాళిక

**రైతులు ఎవరు ఆందోళన చెందవద్దు: తాసిల్దార్ పున్నంచందర్**

**రైతులకు సంవృద్ధిగా యూరియా సరఫరా జరుగుతుంది: మండల వ్యవసాయ అధికారి తుమ్మెద చయరాజ్**

**సబ్ ఇన్స్పెక్టర్ గంద్ర సంతోష్ రావు, ఎంపీడీవో మొహమ్మద్ గౌస్**

**సీరోల్, సెప్టెంబర్ 13(పి.సి.డబ్ల్యూ న్యూస్):**మహబూబాబాద్ జిల్లా,సీరోలు మండలంలోని తాసిల్దార్ కార్యాలయంలోని నిర్వహించిన అధికారుల సమీక్ష సమావేశంలో తాసిల్దార్ పున్నంచందర్ పాల్గొని మాట్లాడుతూ ఇప్పటి వరకు 635ఎం టీ (మెట్రిక్ టన్నుల) యూరియా కాంపెల్లి,మన్నెగూడెం మండల సహకార సంఘాల ద్వారా తేది: 12.09.2015 వరకు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం శనివారం నుండి రైతుబంధులో ఉన్న లిస్ట్ ప్రకారం అసలు యూరియా అందని రైతులకు ప్రాధాన్యత ఇస్తూ రోజువారి లిస్టులు తయారు చేసి వాట్సాప్ గ్రూపుల ద్వారా సామాజిక మాధ్యమాల ద్వారా రైతులకు గ్రామాలకు సమాచారం చేరవేస్తాము అని తెపినారు.పోలీస్ సహకారంతో, రెవెన్యూ, పంచాయితీ,వ్యవసాయ శాఖకు పూర్తి స్థాయిలో నిమగ్నమై ఈ పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. సంవృద్ధిగా మూరియా పంపిణి రైతులకు మండల రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.అందుకని ప్రతి రోజు సంవృద్ధిగా యూరియా సరఫరా జరుగుతుంది.కావున ఆదుకై రైతు ఆందోళన చెందవద్దని తెలయచేస్తున్నాము. రైతులు సమన్వయా పాటించి అవసరం మేరకు మాత్రమే యూరియా కొనుగోలు చేయమని కోరుతన్నాము ప్రతి ఒక్క రైతుకు యూరియా పంపిణీజరుపబడును అని తెలిపారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ పూర్ణచందర్,ఎంపీడీవో మహమ్మద్ గౌస్,అగ్రికల్చర్ ఆఫీసర్ తుమ్మెద చయరాజ్, సీరోలు సబ్ ఇన్స్పెక్టర్ గంద్ర సంతోష్ పాల్గొన్నారు.



## అట్టహాసంగా ఖమ్మంలో గోయజ్ 14వ సిల్వర్ షాపింగ్ మాల్ను ప్రారంభం

**● ప్రారంభించిన సినీ నటి భాగ్యశ్రీ బోర్స్**





**ఖమ్మం, సెప్టెంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** భారతదేశంలోని అతిపెద్ద లగ్జరీ సిల్వర్ జ్యూవెలరీ స్టోర్ గల గోయజ్ 14వ షాపింగ్ మాల్ ను ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డులో అట్టహాసంగా ప్రారంభించారు. ఈ యొక్క జ్యూవెలరీ మాల్ను ప్రముఖ సినీనటి భాగ్యశ్రీ బోర్స్ చేతుల మీదుగా ప్రారంభించారు.ఆమె మాట్లాడుతూ.. భారతదేశంలోనే అతిపెద్ద లగ్జరీ సిల్వర్ జ్యూవెలరీ స్టోర్ లలో గోయెజ్ ఒకటని, ప్రారంభోత్సవం సందర్భంగా స్టోర్ వాళ్ళు కొన్ని ఆఫర్లను చేశారని, లక్ష రూపాయలు విలువగల సిల్వర్ జ్యువెలర్స్ కొనుగోలు చేస్తే, 50,000 రూపాయలు విలువగల సిల్వర్ జ్యూవెలరీ ఉచితంగా అందుతుంది. 50వేల రూపాయల విలువ గల సిల్వర్ జ్యూవెలరీ కొనుగోలు చేస్తే, 25వేల విలువైన సిల్వర్ జ్యూవెలరీ ఉచితంగా అందుతుంది. 25 వేల రూపాయల సిల్వర్ జ్యువెలర్స్ కొనుగోలు చేస్తే, 12,500 విలువగల సిల్వర్ జూలరు ఉచితంగా అందుతుందని యొక్క ఆఫర్ ను ఈ ఒక్కరోజు మాత్రమే అందజేయడం జరుగుతుందని యొక్క అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఆమె అన్నారు. అనంత ఆమె ప్రజలతో సందడి చేసింది.

## అమర వీరుల స్మారక పైలాన్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న టిపిసిసి ప్రధాన కార్యదర్శి పల్లె శ్రీనివాస్ గౌడ్



**యాదాద్రి సెప్టెంబర్ 13(పి.సి.డబ్ల్యూ న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గానికి చెందిన టిపిసిసి ప్రధాన కార్యదర్శి పల్లె శ్రీనివాస్ గౌడ్ శనివారం రోజున నల్లగొండ జిల్లా శాలిగౌరం మండలం వల్లాల గ్రామంలో అమర వీరుల స్మారక పైలాన్ ఆవిష్కరణను టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 17న జిల్లా కబడ్డి సబ్ జూనియర్ జట్ల ఎంపిక

**పాపన్నపేట,సెప్టెంబర్ 13(పి.సి.డబ్ల్యూ న్యూస్):**మండల కేంద్రమైన పాపన్నపేటలో ఈనెల 17న జిల్లా కబడ్డి అసోసియేషన్ అద్వర్యంలో సబ్ జూనియర్ జట్ల ఎంపిక జరుగుతుందని జిల్లా సెక్రెటరీ రమేష్ తెలిపారు. ఈ నెల 17న పాపన్నపేట ఉన్నత పాఠశాల గ్రౌండ్లో ఉదయం 10 గంటలకు ఎంపికలు ఉంటాయని, ఇక్కడ ఎంపికైన క్రీడా కారులు ఈ నెల 25 నుంచి 28 వరకు నిజామాబాద్ జిల్లాలో జరుగబోయే రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల కబడ్డి చాపియన్ షిప్ లో జిల్లా తరుపున పాల్గొనాల్సి ఉంటుందన్నారు.ఇందులో పాల్గొనే క్రీడాకారులు 16 సం.. లోపు ఉండాలని బరువు : 55 కిలోలకు మించి ఉండకూడదని వెల్లడించారు. మిగతా వివరాలకు 9010735121 నెంబర్లో సంప్రదించాల్సిందిగా సూచించారు.

# ఆసియా కప్‌లో పాకిస్తాన్‌పై తొలిసారి ఆడనున్న ఐదుగురు భారత ఆటగాళ్లు




ఆపరేషన్ సిందూర్ తర్వాత, పాకిస్తాన్‌తో భారతదేశం పాల్గొనడంపై సందేహాలు తలెత్తడంతో, ఆసియా కప్ 2025 అనిశ్చితిని ఎదుర్కొంది. చివరికి, భారత ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది, సెప్టెంబర్ 14న దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో అభిమానులు ఈ పోరును చూడబోతున్నారు. ఈ మ్యాచ్ కోసం ఇంకా టీమ్ ఇండియాను ప్రకటించలేదు. భారత జట్టులో ఐదుగురు ఆటగాళ్లు ఉన్నారు, వీరు పాకిస్తాన్‌తో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. సెప్టెంబర్ 14న జరిగే మ్యాచ్‌లో ఈ ఆటగాళ్లకు పాకిస్తాన్‌తో ఆడే అవకాశం లభించవచ్చు. భారత్, పాకిస్తాన్ మధ్య 2012-13 నుంచి ఎలాంటి ద్వైపాక్షిక సిరీస్ జరగలేదు. ఈ రెండు జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్‌లు అంతర్జాతీయ, ఆసియా ఈవెంట్స్‌లో మాత్రమే జరుగుతాయి. దీని కారణంగా, భారత జట్టులో చేరిన యువ ఆటగాళ్లు ఇప్పటివరకు పాకిస్తాన్‌తో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఈ ఆటగాళ్లలో భారత ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ అభిషేక్ శర్మ, వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ సంజు శాంసన్, జితేశ్ శర్మ పేర్లు ఉన్నాయి. వీరితో పాటు తిలక్ వర్మ, రింకు సింగ్ కూడా పాకిస్తాన్‌తో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. భారతదేశానికి చెందిన ఈ ఐదుగురు ఆటగాళ్లలో ముగ్గురికి ఆసియా కప్ మొదటి మ్యాచ్‌లో అవకాశం లభించింది. అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, సంజు శాంసన్ యూఏఈతో జరిగిన ప్లేయింగ్ ఎలెవన్ జట్టులో ఉన్నారు. ఒకవేళ టీమ్ ఇండియా పాకిస్తాన్‌తో జరిగే ప్లేయింగ్ ఎలెవన్ జట్టులో ఎలాంటి మార్పులు చేయకపోతే, ఈ ఆటగాళ్లు పాకిస్తాన్‌తో తమ కెరీర్‌లో తొలి మ్యాచ్ ఆడతారు. అదే సమయంలో రింకు సింగ్, జితేశ్ శర్మలు వేచి చూడాల్సి ఉంటుంది. పాకిస్తాన్‌తో జరిగే మ్యాచ్‌లో భారత్ ప్లేయింగ్ ఎలెవన్‌ను సెప్టెంబర్ 14న మ్యాచ్‌కు ముందే ప్రకటించవచ్చు. ఆసియా కప్ 2025 టీ20 ఫార్మాట్‌లో జరుగుతోంది. అదే సమయంలో భారత జట్టులో శుభ్‌మన్ గిల్, కుల్దీప్ యాదవ్ ఇద్దరు ఆటగాళ్లు ఉన్నారు, వీరు పాకిస్తాన్‌తో %ాణ×% మ్యాచ్‌లు ఆడారు, కానీ టీ20లో ఇంతకు ముందు పాకిస్తాన్‌తో ఎప్పుడూ ఆడలేదు. సెప్టెంబర్ 14న గిల్, కుల్దీప్ పాకిస్తాన్‌తో తొలి టీ20 మ్యాచ్ ఆడవచ్చు. భారత స్పిన్నర్లు, ముఖ్యంగా కుల్దీప్ యాదవ్ , వరుణ్ చక్రవర్తి పాకిస్తాన్ మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్‌కు ఇబ్బంది పెడతారని వసీం అక్రమ్ హెచ్చరిస్తున్నారు. "పాకిస్తాన్ మిడిల్-ఆర్డర్ బ్యాటింగ్ భారత స్పిన్నర్లతో ఇబ్బంది పడుతుంది. జస్ప్రీత్ బుమ్రాను భయంకరంగా కనిపించవచ్చు కానీ, కానీ వరుణ్, కుల్దీప్ వంటి వారు బ్యాటర్లను ఇబ్బంది పెట్టవచ్చు. బంతి పిచ్ అయిన తర్వాత ఒక బ్యాటర్ బంతిని రీడ్ చేస్తున్నాడంటే ఏమి జరుగుతుందో తెలియదని అర్థం" అని చెప్పారు. పాకిస్తాన్ లాగానే భారతదేశం కూడా 2025 ఆసియా కప్‌లో ఒకే ఒక్క మ్యాచ్ ఆడినప్పటికీ, ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌కు కుల్దీప్ యాదవ్ ఎంత ఇబ్బందికరంగా ఉంటాడో చూపించడానికి ఇది సరిపోతుంది.భారత 11 ఇదే కావచ్చు: అభిషేక్ శర్మ - ఓపెనర్, శుభ్‌మన్ గిల్ - ఓపెనర్, తిలక్ వర్మ - బ్యాటర్, సూర్యకుమార్ యాదవ్ - బ్యాటర్, సంజు సామ్సన్ - కీపర్-బ్యాటర్, హార్దిక్ పాండ్యా - ఆల్ రౌండర్, శివమ్ దూబ్టే - ఆల్ రౌండర్, అక్షర్ పటేల్ - స్పిన్నర్, వరుణ్ చక్రవర్తి - స్పిన్నర్, కుల్దీప్ యాదవ్ - స్పిన్నర్ , జస్ప్రీత్ బుమ్రా - పేసర్. బెంచ్: అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, రింకు సింగ్, జితేష్ శర్మ.

# మ్యాచ్‌పైనే ఫోకస్ పెట్టండి

## - టీమ్‌ఇండియా బ్యాటింగ్ కోచ్ సీతాన్షు కోటక్




ఆసియా కప్‌లో భాగంగా దుబాయ్ వేదికగా ఆదివారం భారత్- పాకిస్థాన్ మ్యాచ్ జరగనుంది. అయితే ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందే వాతావరణం అంతటా వేడెక్కింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత ఇరుజట్లు తలపడడం ఇదే తొలిసారి. ఇప్పటికీ రెండు దేశాల మధ్య వివాదాలు సద్దుమణగలేదు. ఇలాంటి పరిస్థితిలో పాకిస్థాన్‌తో భారత్ క్రికెట్ ఆడకూడదని అనేక మంది అభిమానులు, నెటిజన్లు డిమాండ్ చేశారు. బాయ్‌కాట్ అంటూ ట్రెండ్ కూడా చేస్తున్నారు. మరి ఈ నేపథ్యంలో టీమ్‌ఇండియా బ్యాటింగ్ కోచ్ సీతాన్షు కోటక్ ఈ వ్యవహారంపై స్పందించాడు. టీమ్‌ఇండియా ప్లేయర్లు క్రికెట్‌పై మాత్రమే దృష్టి సారించాలని, మిగిలిన ఏ విషయాలను పట్టించుకోకూడదని బ్యాటింగ్ కోచ్ సీతాన్షు కోటక్ స్పష్టం చేశారు. "బీసీసీఐ ప్రభుత్వ నిర్ణయంతో పూర్తిగా ఏకీభవించింది. పాక్‌తో మ్యాచ్ గురించి బోర్డు క్లారిటీ ఇచ్చినప్పటి నుంచీ మా దృష్టి మ్యాచ్‌పై మాత్రమే ఉంది. భారత్- పాక్ మ్యాచ్ ఎల్లప్పుడూ ఆసక్తికరమే. ప్లేయర్లు కూడా మైదానంలో ఆటపైనే మొత్తం ఫోకస్ పెట్టాలి. మిగతా విషయాలేవీ పట్టించుకోకూడదు" అని కోటక్ చెప్పారు. అనంతరం ఇరుజట్ల కెప్టెన్లూ దూకుడుగానే ఉంటామని అన్నారు. ఉగ్రదాడి తర్వాత తొలిసారి మ్యాచ్ ఉన్నందున సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అలాగే దీనిపై భిన్నమైన డిమాండ్లు వినిపిస్తున్నాయి. దీనిపై కేంద్ర క్రీడా శాఖ మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్‌ను కూడా మీడియా ప్రశ్నించింది. దీనికి ఆయన, ఆసియా క్రికెట్ కౌన్సిల్, ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ బోర్డులు నిర్వహించే టోర్నమెంట్లను బహిష్కరించలేమని అనురాగ్ ఠాకూర్ వివరించారు. "ఆసియా క్రికెట్ కౌన్సిల్, ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ బోర్డులు నిర్వహించే మల్టీనేషనల్ టోర్నమెంట్లలో మన మ్యాచుల్లో కచ్చితంగా పాల్గొనాలి. ఒకవేళ అలా ఆడకుండా తప్పుకుంటే, ఆ దేశాల జట్లను ఆ టోర్నీ నుంచి ఎలిమినేట్ చేస్తారు. అంతేకాదు మన ప్రత్యర్థి జట్టుకు పాయింట్లు ఇచ్చేస్తారు. అయితే టీమ్‌ఇండియా ఎట్టి పరిస్థితుల్లోనూ పాక్‌తో ద్వైపాక్షిక సిరీస్‌ల్లో ఆడదు. భారత్‌పై పాకిస్థాన్ ఉగ్రవాద దాడులు ఆపే వరకు టీమ్‌ఇండియా ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడకూడదని మేం ఎప్పుడో నిర్ణయం తీసుకున్నాం" అని ఠాకూర్ అన్నారు.కాగా, ఈ టోర్నీలో తొలి మ్యాచ్‌లో యూఏఈపై భారీ విజయం సాధించిన యువ భారత్ జోష్‌మీదుంది. అభిషేక్ శర్మ, శుబ్‌మన్ గిల్, తిలక్ వర్మ, సంజు శాంసన్, సూర్య కుమార్, దూబే, రింకూ లాంటి ఆటగాళ్లతో టీమ్‌ఇండియా ఫుల్ స్ట్రాంగ్‌గా ఉంది. బుమ్రా, కుల్దీప్, అక్షర్, వరుణ్ లాంటి ప్లేయర్లతో బౌలింగ్ లైనప్ కూడా బలంగా ఉంది. అన్ని విభాగాల్లో భారత్ పటిష్ఠంగా ఉంది.భారత్-పాక్ చివరిసారిగా 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ 49.4 ఓవర్లలో 241 పరుగులు చేసింది. అనంతరం ఛేదనలో దిగిన భారత్ 42.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఛేజింగ్‌లో విరాట్ కోహ్లీ (100లి పరుగులు) సెంచరీతో అలరించగా, శ్రేయస్ అయ్యర్ (56 పరుగులు) రాణించాడు.

# బీసీసీఐ అధ్యక్షుడిగా ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ..

భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) నూతన అధ్యక్షుడిగా ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీ బాధ్యతలు చేపట్టనున్నారా అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ప్రస్తుత బీసీసీఐ అధ్యక్షుడిగా ఉన్న రోజర్ బిన్నీ పదవి కాలం త్వరలో ముగియనుంది. దాంతో కొత్త అధ్యక్షుడి ఎన్నికకు సంబంధించిన ప్రక్రియను బీసీసీఐ చేపట్టింది. మరో రెండు వారాల్లో బీసీసీఐ సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈ సమావేశంలోనే ఎలాంటి ఎన్నిక లేకుండా ఏకగ్రీవంగా అధ్యక్షుడిని ఎన్నుకోవాలని బీసీసీఐ భావిస్తోంది. ఇందుకోసం రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్స్ మద్దతు తెలిపేలా బీసీసీఐ చర్యలు చేపట్టింది. సెప్టెంబర్ 28న బీసీసీఐ కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు వార్తలు వస్తున్నాయి. బీసీసీఐ ప్రెసిడెంట్‌తో పాటు వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ పదవులను భర్తీ చేయనుంది. సౌరవ్ గంగూలీ అనంతరం 2022లో బీసీసీఐ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రోజర్ బిన్నీ మూడేళ్ల పదవికాలం త్వరలో ముగియనుంది. ప్రస్తుతం బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్‌గా రాజీవ్ శుక్లా ఉన్నారు. బీసీసీఐ నయా అధ్యక్షుడి రేసులో క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ ఉన్నారని కూడా ప్రచారం జరిగింది. కానీ ఈ వార్తలను సచిన్ కార్యాలయం ఖండించింది. బీసీసీఐలో ఏ పదవి చేపట్టేందుకు సచిన్ టెండూల్కర్ ఆసక్తి లేదని స్పష్టం చేసింది. అయితే బీసీసీఐ అధ్యక్షుడి రేసులో టీమిండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ కూడా ఉన్నట్లు అర్థమవుతోంది. సెప్టెంబర్ 28న బీసీసీఐ నిర్వహించే వార్షిక సర్వసభ్య సమావేశంలో పంజాబ్ క్రికెట్ అసోసియేషన్(పీసీఏ) తమ ప్రతినిధిగా హర్భజన్ సింగ్‌ను నామినేట్ చేయడం ఈ వార్తలకు బలం చేకూరుస్తోంది. ప్రస్తుతం హర్భజన్ సింగ్ ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. 2022లో భజ్జీని ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభకు నామినేట్ చేసింది. ఒకవేళ హర్భజన్ సింగ్ బీసీసీఐ అధ్యక్షుడిగా ఎన్నికైతే.. సౌరవ్ గంగూలీ, రోజర్ బిన్నీ తర్వాత మరో వరల్డ్ కప్ విజేతకు ఈ అవకాశం వచ్చినట్లు అవుతుంది. హర్భజన్ సింగ్ టీమిండియా గెలిచిన 2007 టీ20 ప్రపంచకప్, 2011 వన్డే ప్రపంచకప్ గెలిచి జట్లలో సభ్యుడు. హర్భజన్ సింగ్‌తో పాటు బీసీసీఐ అధ్యక్షుడి రేసులో మాజీ క్రికెటర్, 63 ఏళ్ల కిరణ్ మోరె కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వెస్ట్ జోన్‌కు చెందిన వారికి ఈ సారి అధ్యక్షుడిగా అవకాశం దక్కనున్నట్లు ప్రచారం జరుగుతుంది. కిరణ్ మోరె సౌరాష్ట్రకు చెందిన మాజీ క్రికెటర్. రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత ఆయన సెలెక్షన్ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరించాడు. 2019లో యూఏస్ క్రికెట్‌కు తాత్కలిక కోచ్‌గా, డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు. అయితే బీసీసీఐ అధ్యక్షుడి రేసులో భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ఉన్నట్లు వార్తలు వచ్చాయి. బోర్డు సభ్యులు కూడా సచిన్ టెండూల్కర్ పట్ల ఆసక్తి చూపుతున్నట్లు ప్రచారం జరిగింది. కానీ ఈ వార్తలను సచిన్ టెండూల్కర్ కార్యాలయం ఖండించింది. ఈ వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని పేర్కొంది. బీసీసీఐలో ఏ పదవి చేపట్టేందుకు సచిన్ టెండూల్కర్ ఆసక్తిగా లేరని స్పష్టం చేసింది. ఈ మేరకు సచిన్ టెండూల్కర్‌కు చెందిన ఎస్ఆర్‌టీ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ గురువారం ఓ ప్రకటనను విడుదల చేసింది.'బీసీసీఐ అధ్యక్ష పదవి రేసులో సచిన్ టెండూల్కర్ ఉన్నారని, నామినేట్ అయ్యారని జరుగుతున్న ప్రచారం మా దృష్టికి వచ్చింది. అయితే ఇందులో ఏ మాత్రం నిజం లేదు. బీసీసీఐలోని ఏ పదవిపై సచిన్ టెండూల్కర్‌కు ఆసక్తి లేదు. నిరాధారమైన ఊహాగానాలకు ప్రాధాన్యత ఇవ్వద్దని అందర్నీ కోరుతున్నాం.'అని ఆ ప్రకటనలో పేర్కొంది. సెప్టెంబర్ 28న బీసీసీఐ కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోనుంది. బీసీసీఐ ప్రెసిడెంట్‌తో పాటు వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ పదవులను భర్తీ చేయనుంది. సౌరవ్ గంగూలీ అనంతరం 2022లో బీసీసీఐ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రోజర్ బిన్నీ మూడేళ్ల పదవికాలం త్వరలో ముగియనుంది. ప్రస్తుతం బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్‌గా రాజీవ్ శుక్లా ఉన్నారు. భారత క్రికెట్ ముఖచిత్రంగా ఎదిగిన సచిన్ టెండూల్కర్.. వరల్డ్ బెస్ట్ బ్యాటర్‌గా గుర్తింపు పొందారు. రెండున్నర దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌లో సచిన్ 200 టెస్ట్‌లు ఆడి 15921 పరుగులు చేశాడు. టెస్ట్‌ల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. 463 వన్డేల్లో 18426 పరుగులు చేసిన సచిన్.. ఒకే ఒక్క టీ20లో 10 పరుగులు చేశాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 100 సెంచరీలు సాధించిన ఏకైక బ్యాటర్‌గా కూడా రికార్డ్ అందుకున్నాడు. 2015-19 మధ్య బీసీసీఐ క్రికెట్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా సచిన్ సేవలందించాడు.

# ఫైనల్ చేరిన జైస్మిన్, నుపుర్

వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో జైస్మీన్ లాంబోరియా, నుపుర్ షెరాన్ దుమ్మురేపారు. అద్వితీయమైన ప్రదర్శనతో ఫైనల్ దూసుకెళ్లి బంగారు పతకానికి అడుగు దూరంలో నిలిచారు. శుక్రవారం జరిగిన మహిళల 57 కేజీల సెమీఫైనల్లో జైస్మీన్ 5-0తో ఒమైలిన్ అల్కాలా(వెనిజువెలా)ను ఓడించింది. ఫైనల్లో ఆమె పారిస్ ఒలింపిక్స్ సిల్వర్ మెడలిస్ట్ జులియా(పోలెండ్)తో తలపడనుంది. 80 కేజీల విభాగంలో జరిగిన సెమీఫైనల్లో నుపుర్ షెరాన్ 5-0తో దుజ్గన్ సెమ(తుర్కియే)ను చిత్తు చేసింది. మ్యాచ్ ఆరంభం నుంచి వ్యూహాత్మకంగా ఆడిన నుపుర్ ప్రత్యర్థిపై క్రమం తప్పకుండా పంచ్‌లు విసిరి.. ఆధిపత్యం చెలాయించింది. మరోవైపు మీనాక్షి హుడా స్ఫూర్తిదాయక ప్రదర్శనతో సెమీఫైనల్ చేరి పతకాన్ని ఖాయం చేసింది. 48 కేజీల క్వార్టర్ ఫైనల్లో అండర్ 19 ప్రపంచ ఛాంపియన్ అలిస్ పామ్‌ఫెరి(ఇంగ్లండ్)ను మీనాక్షి చిత్తు చేసింది. ఈ బౌట్లో తన ఎత్తును అడ్వాంటేజ్‌గా మార్చుకుంది. బ్యాక్‌ఫుట్‌పై ఉంటూ ప్రత్యర్థిపై దాడి చేసింది. బలమైన డిఫెన్స్‌తో ప్రత్యర్థి పంచ్‌లను కాచుకుని విజయాన్ని సొంతం చేసుకుంది. ఫైనల్లో స్థానం కోసం అల్టాంట్(మంగోలియా)తో భారత బాక్సర్ అమీతుమీ తేల్చుకోనుంది. మరోవైపు పురుషుల్లో జాదుమణి సింగ్ పోరాటం క్వార్టర్స్‌లోని ముగిసింది. 50 కేజీల క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ ఛాంపియన్ సాన్ జార్(కజకిస్తాన్) చేతిలో జాదుమణి ఓటమిపాలయ్యాడు. దాంతో పురుషుల్లో భారత్ పోరాటం ముగిసింది. 2013 తర్వాత పురుషుల విభాగంలో భారత్ ఒక్క పతకం కూడా సాధించకపోవడం ఇదే తొలిసారి.




# ఇంగ్లాండ్ ప్రపంచ రికార్డ్ విజయం

### టీ20ఐలో అత్యధిక స్కోరు

### జింబాబ్వే 290 పరుగుల భారీ తేడాతో విజయం

సౌతాఫ్రికాతో జరుగుతున్న టీ20 సిరీస్‌లో ఇంగ్లాండ్ క్రికెట్ జట్టు ప్రపంచ రికార్డ్ సృష్టించింది. సిరీస్‌లో భాగంగా రీసెంట్‌గా జరిగిన రెండో టీ20లో సౌతాఫ్రికాను ఇంగ్లాండ్ చిత్తుగా ఓడించింది. ఇంగ్లాండ్ బ్యాటర్ ఫిల్ సాల్ట్ 141 భారీ ఇన్నింగ్స్‌తో చెలరేగడంతో ఆ జట్టు తొలుత 300ం స్కోర్ సాధించింది. అనంతరం అద్భుత బౌలింగ్‌తో ప్రత్యర్థిని 158 పరుగులకే కట్టడి చేసిన ఇంగ్లీష్ జట్టు 146 పరుగుల భారీ తేడాతో నెగ్గింది. దీంతో పలు ప్రపంచ రికార్డులు నమోదు అయ్యాయి. మాంచెస్టర్ వేదికగా శుక్రవారం రెండో టీ20 జరిగింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 304 పరుగులు చేసింది. ఓపెనర్లు ఫిల్ సాల్ట్- జాస్ బట్లర్ ఈ మ్యాచ్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయారు. వీళ్ల దెబ్బకు సౌతాఫ్రికా బౌలింగ్ విభాగం కుదేలైంది. తొలి వికెట్‌కు కేవలం 7.1 ఓవర్లలోనే 126 పరుగులు జోడించారు. బట్లర్ 30 బంతుల్లోనే 83 పరుగులతో రఫ్ఫాడించాడు. అతడు 276.67 స్ట్రైక్ రేట్‌తో ఆడడం విశేషం. ఓపెనర్లిద్దరు ఓ రేంజ్‌లో ప్రత్యర్థి బౌలర్లను ఉతికి ఆరేశారు. అయితే 7.1 ఓవర్ వద్ద ఫార్చ్యూన్ బౌలింగ్‌లో బట్లర్ ఔటయ్యాడు. ఆ తర్వాత సాల్ట్ చెలరేగిపోయాడు. 60 బంతుల్లోనే సాల్ట్ 141పరుగులులి భారీ శతకం సాధించి ఔరా అనిపించాడు. ఇందులో 15 ఫోర్లు, 8 సిక్స్‌లు ఉండడం విశేషం. ఈ ఇద్దరితోపాటు జాకబ్ బెతేల్ (26 పరుగులు), హ్యారీ బ్రూక్ (41లి పరుగులు) చేశారు. దీంతో ఇంగ్లాండ్ టీ20 చరిత్రలో తొలిసారి 300 పరుగుల మార్క్ అందుకుంది. ఈ క్రమంలోనే ఇంటర్నేషనల్ టీ20లో 300ం స్కోర్ నమోదు చేసిన మూడో జట్టుగా ఇంగ్లాండ్ నిలిచింది. ఇంతకుముందు జింబాబ్వే (344/4 పరుగులు %జం% గాంబియా), నేపాల్ (314/3 %జం% మంగోలియా) ఈ ఫీట్ అందుకున్నాయి. అయియి ఐసీసీ ఫుల్ మెంబర్ టీమ్ (అంటే టెస్టు ఆడే దేశాలు)పై బాదిన అరుదైన ఇంగ్లాండ్ సాధించింది.కాగా, అంతర్జాతీయ టీ20ల్లో ఫుల్ మెంబర్ టీమ్‌పై అత్యధిక స్కోర్ చేసిన భారత్ రికార్డును ఇంగ్లాండ్ తాజా మ్యాచ్‌తో బ్రేక్ చేసింది. ఇదివరకు ఈ లిస్ట్‌లో భారత్ ఉండేది. గతేడాది బంగ్లాదేశ్‌పై టీమ్‌ఇండియా 297 పరుగులు చేసింది. ఇప్పుడు ఇంగ్లాండ్ 304 రన్స్‌తో భారత్ రికార్డ్ బద్దలుకొట్టింది. ఈ మ్యాచ్‌లో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది సాల్ట్ బ్యాటింగ్ గురించే. అతడు తొలి ఓవర్ నుంచే రెచ్చిపోయాడు. ఎడాపెడా బౌండరీలు బాదుతూ స్కోర్ బోర్డును జెట్ స్పీడ్‌తో పరిగెత్తించాడు. అతడి దెబ్బకు కగిసో రబాడ (70 పరుగులు), విలియమ్స్ (62 పరుగులు), మార్కో జాన్సన్ (60 పరుగులు) లాంటి స్టార్ బౌలర్లకు సైతం భారీ స్థాయిలో పరుగులు ఇచ్చుకున్నారు. ఈ క్రమంలోనే ఇంగ్లాండ్ తరఫున వేగవంతమైన టీ20 సెంచరీ (39 బంతుల్లో) చేసిన రికార్డ్ కొట్టాడు. అలాగే ఆ జట్టు నుంచి టీ20ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోర్ సాధించిన బ్యాటర్‌గానూ నిలిచాడు. కాగా, సాల్ట్ 2025 ఐపీఎల్‌లోనూ ఆర్సీబీ తరఫున అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడాడు. ఆ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. సౌతాఫ్రికాను ఇంగ్లాండ్ 16.1 ఓవర్లలోనే 158 రన్స్‌కు ఆలౌట్ చేసింది. ఈ నేపథ్యంలో ఇంగ్లీష్ జట్టు 146 పరుగుల భారీ తేడాతో నెగ్గింది. టీ20 చరిత్రలోనే ఇంత భారీ తేడాతో నెగ్గిన జట్టుగా ఇంగ్లాండ్ వరల్డ్ రికార్డ్ కొట్టింది.




జాంబియా బౌలర్లు చాలా నిస్సహాయంగా కనిపించారు. వీరంతా జింబాబ్వే బ్యాటర్స్ ముందు వికెట్ల కోసం వేడుకుంటూ కనిపించారు. జింబాబ్వే తరఫున, కెప్టెన్ సికందర్ రజా కేవలం 43 బంతుల్లో 133 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. సికందర్ రజా 309.30 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో 7 ఫోర్లు, 15 సిక్సర్లు బాదాడు. దీంతో పాటు, తదివానాషే మరుమాని 19 బంతుల్లో 62 పరుగులు చేశాడు. తదివానాషే మరుమాని 326.31 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసి తన ఇన్నింగ్స్‌లో 9 ఫోర్లు, 4 సిక్సర్లు బాదాడు. అదే సమయంలో, క్లైవ్ మదండే 17 బంతుల్లో 53 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. క్లైవ్ మదండే 311.76 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసి 3 ఫోర్లు, 5 సిక్సర్లు బాదాడు.టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో ప్రపంచ రికార్డు లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో జాంబియా జట్టు 14.4 ఓవర్లలో కేవలం 54 పరుగులకే కుప్పకూలింది.



# రెండోపెళ్లికి సిద్ధంగా ఉన్న నటి ఎస్తేర్

ఇప్పటి వరకు ఒకే పెళ్లితో జీవితం గడిపేయాల్సిన సమాజపు ఆలోచన మారిపోయింది. విడాకులు తీసుకున్న, జీవిత భాగస్వామి లేకపోయినా, కొత్త జీవితం కోసం మరోసారి పెళ్లి చేసుకోవడమే ఇప్పుడు సాధారణంగా మారింది. సామాన్యులే కాదు, సినీ ప్రపంచంలోనూ ఈ ట్రెండ్ స్పష్టంగా కనిపిస్తోంది. సింగర్ సునీత నుంచి అక్కినేని నాగచైతన్య వరకు చాలామంది రెండో పెళ్లి చేసుకున్న ఉదాహరణలు ఉన్నాయి. అలాంటిది తాజాగా ఈ జాబితాలో చేరబోతున్నారంటూ వార్తల్లో నిలుస్తున్నారు హీరోయిన్ ఎస్తేర్ నొరోన్హా. కర్ణాటకలోని ఉడిపి కి చెందిన ఎస్తేర్, ముంబైలో చదువుకున్నారు. బాలనటిగా కొంకణి సినిమాల్లో నటించి, ఆ తర్వాత 2012లో బారొమాస్ అనే హిందీ సినిమా ద్వారా హీరోయిన్‌గా అడుగుపెట్టారు. తెలుగులో పూరి జగన్నాథ్ సోదరుడు సాయిరామ్ శంకర్ హీరోగా నటించిన వేయి అబద్ధాలు సినిమాతో ఎంట్రీ-ఇచ్చి, భీమవరం బుల్లోడు, గరం, జయ జానకి నాయక, ఐరావతం, 69 సంస్కార్ కాలనీ, చెంగురే బంగారు రాజా, డెవిల్, -టెనెంట్, థలా వంటి సినిమాల్లో నటిస్తూ తనకంటూ గుర్తింపు సంపాదించుకుంది. సినిమాల విషయం పక్కన పెడితే.. వ్యక్తిగత జీవిత విషయంలో మాత్రం తరచూ వార్తల్లో నిలిచింది. కారణం సింగర్ నోయెల్.. అతని ప్రేమించి పెళ్లి చేసుకున్న ఆమె, ఏడాదిలోనే మనస్పర్థలతో విడాకులు తీసుకున్నారు. అయితే ఈ మధ్యకాలంలో ఎస్తేర్ రెండో పెళ్లి చేసుకోబోతున్నారంటూ గాసిప్స్ వినిపించాయి. తాజాగా వాటిని నిజం చేస్తూనే ఓ బిగ్ అనౌన్స్‌మెంట్ ఇచ్చేలా సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. జీవితంలో మరో అందమైన సంవత్సరం.. అవకాశాలు, అద్భుతాలను ఇచ్చినందుకు దేవుడికి కృతజ్ఞతలు. పుట్టినరోజు సందర్భంగా మీ ప్రేమ, ఆశీర్వాదాలకు ధన్యవాదాలు. త్వరలోనే మీతో ఓ స్పెషల్ అనౌన్స్‌మెంట్ పంచుకుంటాను. వేచి ఉండండి' అని రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌తో ఎస్తేర్ నిజంగానే రెండో పెళ్లి చేసుకోబోతుందా అనే వార్తలు హాట్ టాపిక్‌గా మారాయి.

# మిరాయ్ విజయంతో మనోజ్ ఆనందం

## తల్లి ఆశీర్వాదం తీసుకుని సెలబ్రేషన్స్



తేజ సజ్జా, మంచు మనోజ్ కీలక పాత్రల్లో రూపొందిన చిత్రం 'మిరాయ్' సినిమా విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సక్సెస్‌ను కుటుంబం, స్నేహితులతో కలిసి మనోజ్ పండగ చేసుకున్నారు. తన తల్లి పాదాలకు నమస్కారం చేసి ఎమోషనల్ అయ్యారు. ఈ విజయం చూసి ఆమె భావోద్వేగానికి గురయ్యారని.. అందరికంటే గర్వంగా ఫీలయ్యారని మనోజ్ వీడియో షేర్ చేశారు. తనను ఆదరించిన అభిమానులకు ధన్యవాదాలు చెప్పారు. కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో తేజ సజ్జా, మంచు మనోజ్ కీలక పాత్రల్లో కనిపించిన ఈ చిత్రబృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. అందులో మనోజ్ మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యారు. తనను నమ్మిన దర్శక నిర్మాతలకు రుణపడి ఉంటానన్నారు. ఈరోజు ఎంతో ఆనందంగా ఉంది. 12 ఏళ్ల తర్వాత సక్సెస్‌తో నా ఫోన్ మోగుతూనే ఉంది. అభినందనలు వస్తున్నప్పటికీ నాకు ఇదంతా కలలా ఉంది. ఈ కథలో నన్ను భాగం చేసినందుకు కార్తిక్‌కు జన్మంతా రుణపడి ఉంటాను. ఇంతకుముందు నేను ఎక్కడికి వెళ్లినా 'అన్నా సినిమా ఎప్పుడు తీస్తావు. కమ్‌బ్యాక్ ఎప్పుడు?' అని అందరూ అడిగేవారు. త్వరలోనే వస్తాను అని చెప్పేవాడిని. వాళ్లతో బయటకు ధైర్యంగా మాట్లాడినా.. లోపల తెలియని భయం ఉండేది. చాలా సినిమాలు చివరి నిమిషంలో క్యాన్సిల్ అయ్యాయి. అలాంటి టైమ్‌లో కార్తిక్ నన్ను నమ్మడం నా అదృష్టం. మీరు నన్ను మాత్రమే నిలబెట్టలేదు.. నాతో పాటు నా కుటుంబాన్ని కూడా నిలబెట్టారని దర్శకుడు కార్తిక్‌కు మంచు మనోజ్ థాంక్స్ చెప్పారు. నిర్మాత కూడా ఎంతో ధైర్యంగా దీన్ని పూర్తిచేశారు. 'మనోజ్‌తో సినిమా వద్దు' అని ఆయనకు ఎంతోమంది చెప్పి ఉంటారు. అవేవీ వినకుండా విశ్వప్రసాద్ దీన్ని నిర్మించారు. 'మిరాయ్' వీఎఫ్ఎక్స్ టీమ్ తెలుగు సినిమా గర్వపడేలా చేసింది. ముఖ్యంగా ఒక విషయం చెప్పాలి. ప్రతి ఇంట్లో నుంచి మనోజ్ గెలవాలి అని కోరుకున్న వారందరికీ పేరుపేరునా పాదాభివందనం. నామీద నమ్మకం పెట్టుకున్నందుకు అందరికీ ధన్యవాదాలు. ఇకపై వరుస సినిమాలు చేస్తూ మీ అందరినీ అలరిస్తాను అని మనోజ్ తెలిపారు. ఇక మిరాయ్‌లో మహావీర్ లామా పాత్రలో మనోజ్ అందరినీ ఆకట్టుకుంటున్నారు.

# రెండో బేబీ కోసం ప్లాన్ చేస్తున్నాం

## రామ్‌చరణ్- ఉపాసన దంపతులు వెల్లడి



టాలీవుడ్‌లో రామ్‌చరణ్-ఉపాసన దంపతులు ఎప్పుడూ అందరి దృష్టిని ఆకర్షిస్తూనే ఉంటారు. మొదట్లో ఉపాసన పై విమర్శలు వచ్చినప్పటికీ, ఇప్పుడు ఆమెపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ ఏడాది వీరిద్దరూ మెగా అభిమానులకు శుభవార్త అందించారు. పెళ్ళైన 11 ఏళ్ల తర్వాత ఉపాసన తల్లిగా మారారు. వీరికి పాప పుట్టగా, ఆ చిన్నారికి క్లీంకారా అని పేరు పెట్టారు. పాప పుట్టిన తర్వాత మెగా కుటుంబంలో ఆనందం అంబరాన్ని తాకింది. అయితే ఇప్పటి వరకు ఆ చిన్నారిని ప్రపంచానికి చూపించలేదు. అందుకే అభిమానులు కూడా ఆమెను చూడడానికి ఆతృతగా ఎదురు చూస్తున్నారు. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఉపాసన మాట్లాడుతూ.. రెండో సంతానం పై స్పందించారు.. మొదటి బిడ్డ విషయంలో ఆలస్యం చేశాం. నేను పదేళ్ల తర్వాత తల్లిని అయ్యాను. ఆ సమయంలో విమర్శలు, ఒత్తిడి ఎదురైనా పట్టించుకోలేదు. కానీ రెండో బిడ్డ విషయంలో అలాంటి తప్పు చేయదలచుకోవడం లేదు. సెకండ్ చైల్డ్ కోసం నేను సిద్ధంగా ఉన్నాను అని చెప్పింది. అంతే కాదు రామ్‌చరణ్-ఉపాసన దంపతులు కుటుంబ విషయాలతో పాటు- వ్యాపార రంగంలో కూడా ముందుకు సాగుతున్నారు. నిర్మాతగా ఇప్పటికే విజయాలు అందుకున్న రామ్‌చరణ్, ఇప్పుడు థియేటర్ బిజినెస్లోకి అడుగు పెట్టాలని నిర్ణయించుకున్నారు. హైదరాబాద్‌లో లగ్జరీ మల్టీప్లెక్స్‌ను నిర్మించే ప్రాజెక్ట్‌కు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ మల్టీప్లెక్స్ నిర్వహణ బాధ్యతలను ఉపాసన తీసుకోబోతున్నట్లు- తెలుస్తోంది. అపోలో గ్రూప్స్‌తో కలిసి పలు విజయవంతమైన వ్యాపారాలు నడిపిన అనుభవం ఉన్నందున, ఈ ప్రాజెక్టు కూడా ఆమె చేతుల్లో విజయవంతమవుతుందని భావిస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి కూడా ఈ నిర్ణయానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు- సమాచారం. మొత్తానికి మెగా అభిమానులకు ఇది నిజంగా గుడ్ న్యూస్.

# అనుష్క శెట్టి బాటలో మరో నటి ఐశ్వర్య లక్ష్మి

వరుస విజయాలతో దూసుకుపోతున్న యువ నటి ఐశ్వర్య లక్ష్మి, తన అభిమానులకు షాక్ ఇస్తూ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. సోషల్ మీడియా ప్రపంచానికి శాశ్వతంగా వీడ్కోలు పలుకుతున్నట్లు ఆమె ప్రకటించారు. తన మానసిక ప్రశాంతతకు, వృత్తికి ఇది ఆటంకంగా మారిందని వివరిస్తూ ఓ భావోద్వేగ లేఖను పంచుకున్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సినిమా రంగంలో నిలదొక్కుకోవాలంటే సోషల్ మీడియా తప్పనిసరి అని తొలుత భావించానని ఐశ్వర్య తెలిపారు. కానీ, అది తన పనికి ఆటంకం కలిగించడమే కాకుండా, తన ఆలోచనలను దోచుకుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "చిన్న చిన్న సంతోషాలను కూడా ఇది దుఃఖంగా మార్చేసింది. అంతర్జాలం సృష్టించే ఊహలకు, అంచనాలకు అనుగుణంగా జీవించడం ఒక మహిళగా నాకు చాలా కష్టంగా మారింది" అని ఆమె తన నోట్‌లో పేర్కొన్నారు.

ఒక కళాకారిణిగా తనలోని అమాయకత్వాన్ని, వాస్తవికతను కాపాడుకోవడానికే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు ఆమె స్పష్టం చేశారు. "సోషల్ మీడియా లేని వారిని ఈ రోజుల్లో జనాలు మర్చిపోతారని తెలుసు. అయినా ఆ సాహసానికి నేను సిద్ధంగా ఉన్నాను. నాలోని నటిని బతికించుకోవడానికే ఇంటర్నెట్‌కు దూరంగా ఉంటున్నాను" అని ఆమె వివరించారు. ఈ నిర్ణయం తన జీవితంలో బలమైన బంధాలను ఏర్పరుస్తుందని, మరిన్ని మంచి చిత్రాలలో నటించడానికి దోహదపడుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. తనను ప్రేమగా గుర్తుంచుకోవాలని అభిమానులను కోరారు. 'మామన్' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న ఐశ్వర్య లక్ష్మి, ప్రస్తుతం 'గట్ట కుస్తీ-2', 'సంబరాల ఏటిగట్టు' వంటి చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఇలాంటి సమయంలో ఆమె సోషల్ మీడియాను వీడటం చర్చనీయాంశంగా మారింది. ఇటీవలే నటి అనుష్క శెట్టి కూడా సోషల్ మీడియాకు దూరమవుతున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో, ఇప్పుడు ఐశ్వర్య కూడా అదే బాట పట్టడం గమనార్హం. దీనితో కథానాయికలు వరుసగా ఇలాంటి నిర్ణయాలు ఎందుకు తీసుకుంటున్నారనే దానిపై నెటిజన్ల మధ్య ఆసక్తికర చర్చ జరుగుతోంది.



# పిల్లల ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలకు ఆధార్ లింక్ చేయాలి: సాయి తేజ్

**సోషల్ మీడియాలో చిన్నారుల ఫోటోలు, వీడియోల దుర్వినియోగాన్ని అరికట్టాలని పిలుపు**

సోషల్ మీడియాలో చిన్నారుల భద్రతపై మెగా హీరో సాయి దుర్గ తేజ్ కీలక వ్యాఖ్యలు చేశారు. పిల్లల ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి ఖాతాలకు ఆధార్‌ను తప్పనిసరిగా అనుసంధానం చేయాలని ఆయన సూచించారు. దీనివల్ల ఆన్‌లైన్‌లో వారి ఫోటోలు, వీడియోల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయవచ్చని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో జరిగిన 'అభయం మసూమ్-25' సదస్సులో పాల్గొన్న సందర్భంగా సాయి తేజ్ ఈ వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాలో పిల్లల ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేయడం పట్ల తల్లిదండ్రులకు తాను గతంలోనే హెచ్చరిక చేశానని గుర్తుచేశారు. "నిజ జీవితం వేరుగా ఉంటుంది. మీరు సరదాగా పెట్టే పిల్లల ఫోటోలు దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉంది" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నారులపై అశ్లీలతతో కూడిన అనైతిక వ్యాఖ్యలు చేసే వారిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇలాంటి కామెంట్లు చేసేవారికి భవిష్యత్తులో పిల్లలు పుట్టరా? వారి సొంత పిల్లలు, బంధువులు లేదా స్నేహితుల పిల్లలపై ఇలాంటి వ్యాఖ్యలు వస్తే ఊరుకుంటారా? వీరికి కనీస నైతిక విలువలు లేవా?" అంటూ తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. వందల మంది ఇలాంటి వ్యాఖ్యలను లైక్ చేయడం, కామెంట్ చేయడం చూసి తాను




చాలా నిరాశకు గురైనట్లు తెలిపారు. ఈ విషయంపై సమాజం నుంచి గానీ, మీడియా నుంచి గానీ 24 గంటలు ఎదురుచూసినా ఎలాంటి స్పందన రాకపోవడంతో, తానే బాధ్యత తీసుకున్నానని సాయి తేజ్ వెల్లడించారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులను, ఉన్నత పోలీసు అధికారులను ట్యాగ్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేసినట్లు వివరించారు. ఇలాంటి అనైతిక ప్రవర్తనను 'డార్క్ కామెడీ' అని చెప్పి సమర్థించుకోవడం సరికాదని, ఇది ఇతరుల మనోభావాలను దెబ్బతీస్తుందని ఆయన స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికలపై చిన్నారుల భద్రత కోసం కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు